తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం


సంపూర్ణ హాస్య మాస పత్రిక

జూన్ -2024

వెల: ₹20

## అనురాగంలో ఉన్నది చిరునవ్వుల వికాసమే!






చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక | జీ'వనం'లో నవ్వు నవ వసంతం

# హాస్యానందం

**జూన్-2024**

21వ సంవత్సరం
240 వ సంచిక

ముఖచిత్రం: కృతి శెట్టి
కార్టూన్: లేపాక్షి

*Full Pillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*
Dr. K.Ramakrishna
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Dayakar, Gandhi, Nagisetty,
GopalKrishna, Bomman
Sangram, Krishna

*D.T.P:* P. Ramalakshmi,
9440304993

*Digital Media Director:*
Surya

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.

సంవత్సర చందా-రూ.300/-
(పోస్టల్ చార్జీలతో)

2 సంవత్సరాల చందా-రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)

**జీవిత చందా-
రూ.5000/-లు**

Gpay *or* Ppay #
9849630637

email:
**hasyanandam.mag@gmail.com**
web:
**www. hasyanandam.com**

*Publisher& Editor-*
*Ramu.P*

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
A.V.Krishna Murthy,
P. Srikantha Sarma




గమనిక:
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...


వైభవంగా 2024 తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం! 12

యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి
కొంగుచాటు కృష్ణుడు సీరియల్ 16

## కథలు

| | | |
|---|---|---|
| 4 + 4 = 2 ! | దినవహి సత్యవతి | 28 |
| ఉరితాడుతో ఉయ్యాల | గంగాధర్ వడ్లమన్నాటి | 31 |
| రాంబాబు-ది హీరో | వీరేశ్వర రావు మూల | 34 |
| అసలైన జీవితం | పద్మ పైడిమర్రి | 37 |
| మేనేజర్ మిసెస్ | ఆర్.సి.కృష్ణ స్వామి రాజు | 39 |
| విశ్వామిత్ర (ప్ర)యోగం | కంచనపల్లి ద్వారకనాథ్ | 41 |

## శీర్షికలు

| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | 8 |
| తెలుగా మజాకా?! | డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | 10 |
| తర్కారావు కథలు | గంగాధర్ వడ్లమన్నాటి | 21 |
| వాక్చిత్రం | సుధామ | 22 |
| నవ్వులాట | గాంధీ మనోహర్ | 24 |
| స్మైల్ స్టార్స్ | గోపాలకృష్ణ | 26 |
| పదానందం | పోపూరి విశ్వనాథ్ | 50 |


## సీరియల్

| | | |
|---|---|---|
| ఇందు చందు-నవ్వులవిందు | కండ్లకుంట శరత్‌చంద్ర | 46 |





## కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -18 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -19 |
| డబుల్ ధమాకా | -లేపాక్షి | -33 |
| చిలిపి చిలుకలు | -మురళీధర్ | -36 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -43 |
| నెలనెలా వెన్నెల | | -44 |











## ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- మురళీధర్
- లేపాక్షి
- గాంధీ
- బొమ్మన్
- కె.వి.సుబ్రహ్మణ్యం
- ఓంకార్
- పద్మ
- కాశ్యప్
- గోపాలకృష్ణ
- దాస్
- వర్మ
- భాను
- సునీల్
- నాగిశెట్టి
- రామ్‌శేషు
- శర్మ
- చక్రవర్తి
- బీవీఎస్
- డేవిడ్
- శేఖర్‌బాబు
- సునీల్
- రవీంద్ర
- గిరి
- భాను
- క్రిప్
- సురేష్
- శేఖర్
- నరేష్
- కన్నాజీ
- రావు.పి.వి.ఎన్.
- తోపల్లి ఆనంద్
- టి.ఆర్.బాబు
- శ్రీధర్
- మణి
- రంగాచారి
- శరత్‌బాబు
- రవిశంకర్
- బొమ్మన్



హాయ్... సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు...సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**అం**దరికంటే భిన్నంగా, ఉన్నతంగా ఆలోచించే వారిని మేధావులు అంటాము.

అయితే ఈ మధ్య కాలంలో 'స్వయం ప్రకటిత మేధావులు' ఎక్కువైపోయారు. ఎక్కడ చూసినా... ఎవరిని కదిలించినా ఓ చిన్న సైజు 'స్పీచ్' వినాల్సొస్తోంది. ఇక సోషల్ మీడియాలో అయితే చెప్పనవసరం లేదు. మాట్లాడే ప్రతివాళ్ళూ 'మేధావులే'. ఎదుటివారు చెప్పేది వారు వినరు... వారు చెప్పేదే మనం వినాలి! ఇంకో రకం మేధావులు వారి బతుకు తెరువే వారికి తెలియక సతమతమౌతూ ఎదుటి వారికి 'ఎలా బ్రతకాలో' చెబుతారు. మరి కొందరైతే మన మాట పూర్తి కాకుండానే మనం ఏమనుకుంటామో చెప్పేస్తుంటారు.

మరో రకం మేధావులు ఉన్నారు... వీరు అద్భుతమైన నీతులు చెప్తూ కాలం గడుపు తుంటారు... కానీ వీరికి మాత్రం ఆ 'నీతులు' వర్తించవు... పాటించరు.

...ఇలా వీరందర్నీ భరిస్తూ నేడు మనం నెట్టుకు రావటం చాలా కష్టమైన పని అయి పోతోంది. ఇందులో మరో కొత్త సమస్య ఏమిటంటే... ఒక విషయాన్ని నలుగురు నాలుగు విధాలుగా విశ్లేషిస్తారు. వాటిలో మనం దేన్ని నమ్మాలో... దేన్ని అనుసరించాలో తెలియక మనకుండే సమస్యలతో పాటు ఇదో కొత్త సమస్యగా తయారయింది.

వారి వారి అభిప్రాయాలను 'ఇది ఇంతే!' అని సిద్ధాంతంగా మన మీద రుద్దడం ఎంత వరకు సమంజసం? కనీస జ్ఞానం లేకుండా టీవీల్లో... యూట్యూబ్‌ల్లో మన బుర్రలను తొలిచేస్తున్న ఈ మేధావుల బ్రతుకు తెరువు అయిపోయిన ఈ 'వాక్చాతుర్యం' అనే 'పద్మవ్యూహం'లో చిక్కుకున్న అభిమాన్యుల్లా తయారవకుండా మనల్ని మనం మనకుండే 'ఇంగిత జ్ఞానం'తో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొందాం...

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....




✦ **భాను, కార్టూనిస్టు, బొబ్బిలి**

**గ**త 40సంవత్సరాలుగా నేను కార్టూన్లు వేస్తున్నాను. ఆ రోజుల్లో కార్టూన్ పోటీ అంటే... బహుమతిని ఎం.ఓ రూపంలో పంపించి చేతులు దులుపుకునేవారు. అటువంటిది మీరు ఒక వేదిక ఏర్పాటు చేసి, అందులో కార్టూన్ పోటీలో బహుమతి పొందిన వారికి బహుమతి నిచ్చి సన్మానించి ఎంతో ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా మే 20. ఇది కార్టూనిస్టుల పండగ. ఈ పండగను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న మీకు, సహకరిస్తున్న దాతలకు ఈ సందర్భంగా నా నమస్కారాలు తెలియజేస్తున్నాను. ఈ సంవత్సరం నేను ఇందులో బహుమతి సాధించి, ఇందులో పాలుపంచుకోవడం నాకెంతో ఆనందంగా ఉంది.




✦ **పి.వి. శ్రీనివాస్ శ్రీలేఖ, సికింద్రాబాద్**

**మే**,2024 సంచికలో ప్రతి కార్టూన్ పక్కన కార్టూనిస్ట్ ఫోటో కూడా ఇచ్చారు. అందరి కార్టూనిస్ట్‌ల ఫోటోలు ఉండే ఈ సంచికను అట్టే పెట్టుకుంటాం. స్మైల్ స్టార్స్‌లో తలిశెట్టిరామారావు తొలి తెలుగు వ్యంగ్య చిత్రకారుడు అంటూ పరిచయం చేశారు. ఎన్నో మంచి విషయాలు తెలుసుకున్నాం. వారు 1896 సంవత్సరంలో పుట్టడం, అదే ఏడాది ఒలింపిక్స్‌లాంటి అంతర్జాతీయ క్రీడా పోటీలు ప్రారంభం అవ్వటం యాదృచ్ఛికం.

కార్టూన్ పోటీల్లో మొదటి బహుమతి కి 10,000 రూపాయలు, అంత పెద్ద మొత్తం పారితోషికం ఒక కార్టూన్‌కు చూడటం ఇదే ప్రథమం మా జీవితంలో. ప్రతి బహుమతితో సహా ప్రశంసాపత్రం ఇవ్వటం మీ ఔదార్యం మరియు ప్రోత్సాహక నిర్వాహక తీరు చాటుతుంది. అన్ని పత్రికలు మరియు అన్ని సంస్థలు, మీ (పత్రిక) దగ్గర ప్రోత్సాహ పాఠం నేర్చుకోవచ్చు అనటంలో అతిశయోక్తి లేదు. అప్పుడు తప్పులు లెక్కపెట్టడం కనుమరుగు అయిపోతుంది లోకంలో. సంతోష పూరిత నిర్వహణతో ప్రపంచం స్వర్గంలా మారిపోతుంది.

✦ **మహాలక్ష్మి.ఆమంచి, గుంటూరు**

**కా**ర్టూన్ల ప్రత్యేక సంచికలో 'వాడినా వాడని నవ్వుల పువ్వుల' గుభాలింపు మా మనసులకి హత్తుకుంది. కార్టూన్లతో పూర్తిగా ఒక ప్రత్యేక సంచిక రూపొందించింది బహుశ తెలుగులో హాస్యానందమే అనుకుంటా. పోటీల్లో మీరిచ్చే బహుమతులు చూస్తే కార్టూనిస్టుల పాలిట కల్పతరువు హాస్యానందం అని ఘంటాపథంగా చెప్పవచ్చు. మీ ప్రయాణం అవిఘ్నంగా సాగాలని కోరుకొంటున్నాను.



రాసిందల్లా హాస్యం' అయి
పాఠకులను నవ్వుల నావలో విహరింపజేసిన
కల్పనాచాతురికి, చమత్కృతికీ
కేరఫ్ అడ్రస్ మన
**పొత్తూరి విజయలక్ష్మిగారు.**
**20 నవలలు - 150 కి పైగా కథలు-**
వందలాది వ్యాసాలు రచించిన
ప్రతిభకి అబ్బుర పడి...
హాస్యానందం వచ్చేనెల (జులై)
**పొత్తూరి విజయలక్ష్మిగారి**
ప్రత్యేక సంచిక రూపొందిస్తోంది...
ఈవిడ ప్రతిభని కాస్త పరిచయం చేయాలన్న
మా ప్రయత్నమే ఈ ప్రత్యేక సంచిక!




# ముళ్లపూడి
# సింగిల్ పేజీ హాస్య కథల పోటీ

ప్రఖ్యాత రచయిత ముళ్లపూడి వెంకటరమణగారి పుట్టిన్రోజు జూన్,28 సందర్భంగా

శ్రీ ఏ.వి.కృష్ణమూర్తి (సికింద్రాబాదు) గారి సౌజన్యంతో

ఎప్పట్లాగే హాస్యానందం ఈ పోటీని నిర్వహిస్తోంది.

**ఎంచక్కా ప్రతి కథకు 1000 రూపాయలు చొప్పున పది బహుమతులు ఉంటాయి**



**నిబంధనలు:**


- మీ కథలు రాత ప్రతిలో రెండు పేజీలకు మించకూడదు
- తెలుగుతనం ఉట్టిపడేలా కథలు ఉండటమే కాదు... నవ్వు కూడా రావాలండోయ్!

కథలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ జూన్-10,2024.

కథలు ఈ మెయిల్‌కి పంపండి- hasyanandampoteelu@gmail.com

హాస్యానందం సౌజన్యంతో

భారతీయ జ్యోతిర్వాస్తు విజ్ఞాన సంస్థ, అమరావతి వారి సమర్పణలో



# మరో కార్టూన్ పోటీ

## దసరా కార్టూన్ల పోటీ

**అంశం: జ్యోతిష్యం, వాస్తు**

జ్యోతిష, వాస్తు శాస్త్రములను ఏ విధంగానూ కించపరచకుండా, వాటి లోని పెడధోరణులను, లోపాలను సున్నితంగా, వ్యంగ్యంగా, హాస్యస్ఫోరకంగా ఎత్తిచూపే కార్టూన్‌లను పోటీకి ఆహ్వానిస్తున్నాము.

| మొదటి బహుమతి | రెండవ బహుమతి | మూడవ బహుమతి |
|---|---|---|
| రూ. 2,000/- లు | రూ. 1,500/- లు | రూ. 1,000/- లు |

**10 ప్రోత్సాహక బహుమతులు ఒకోక్కరికీ -రూ. 500/-లు**

కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరు తేదీ- సెప్టెంబర్-01,2024.

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపండి-


hasyanandampoteelu@gmail.com


# ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో
ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు
**ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.










**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**
కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.

- మొదటి బహుమతి- **రూ.500/-లు**
- రెండవ బహుమతి- **రూ.300/-లు**
- మూడవ బహుమతి- **రూ.200/-లు**










కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.



**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.










కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.



**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝుల యల్లారి**
**బాల వెంకట సత్య సూర్యకాంతం** జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**






## ప్రతి నెలా పోటీలే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్కొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!





డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

*ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ పాలక మండలి సభ్యులు*

90320 44115


**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

(ఏప్రిల్ సంచిక తరువాయి)

**ఓ** వార్త శీర్షికలో సమాజ సేవకు అంకూరార్పణ అని ఉందట. **అంకురము, అంకూరము** అనే పదాలు ఉన్నాయి. కానీ **అంకూరార్పణము** ఏమిటంటూ గర్జించారు.

నాకు తెలియదంటే ఊరుకోలేదు తల్లీ. **అంకురార్పణము** అనే రాయాలి. లేకపోతే, **అంకురారోపణము** అని కూడా రాయవచ్చుట. ఈ విషయం ఆఫీసులో కూడా చెప్పమన్నారు తల్లీ. నాకు అంతస్థాయి లేదంటే వినిపించుకోలేదు. పైగా ఆ వార్త రాసిన వ్యక్తి ఎవరు? పేరు చెప్పమంటూ ప్రాణం తీసారు... ఇంత జరిగినా బుద్ధి రాలేదు నాకు. రమేష్ రాసాడు అన్నా. అంతే! మళ్ళీ గర్జించారు మహానుభావుడు.

'రమేష్, సురేష్ అని పలక కూడదు... రాయకూడదు. రమేశ్, సురేశ్ అని మాత్రమే రాయాలి. అయినా, మన భాష అజంత భాష. హలంతం కాదు. ఈ ఇష్ లు బుష్ లు ఎందుకయ్యా?' అంటూ ఇంకా ఏవేవో చెప్పారు తల్లీ. ఒక్క ముక్క అర్థం కాలేదు... ఈ అజంతం ఏమిటో, హలంతం ఏమిటో కానీ నా జీవితం అంతం అయ్యేలా ఉంది. నువ్వైనా కాపాడమ్మా!"...

ఒక్కక్షణం ఊపిరి పీలుకుని...

"అమ్మా! ఈయన తెలుగు పిచ్చితో ఎలా వేగుతున్నావు తల్లీ! జరిగిన సంఘటన గుర్తు వస్తేనే ఏదో అయిపోతోంది. పిచ్చెక్కకుండా ఇన్నాళ్ళు ఎలా ఉన్నాను. బాబోయ్... ఇంక నేనీ ఉద్యోగం మానేస్తాను తల్లీ..." అంటూ మరుక్షణంలో మాయమ్యాడు.

రత్నం చూస్తున్న చూపునకు అర్థం పూర్తిగా అర్థమైంది.

లేచి, రెండు చేతులూ ప్యాంటు జేబుల్లో పెట్టుకుని బయల్దేరాను. ఎక్కడికి వెళ్తున్నానో నాక్కూడా తెలియదు.


✦✦✦

"మాస్టారూ... మాస్టారూ..." అంటూ పొలికేక పెట్టుకుంటూ అమాంతం ఇంట్లోకి దిగాడు పరంధామయ్య.

సాయంత్రం వేళ అలా వాలు కుర్చీలో సేద తీరుతున్న నాకు ఈ హఠాత్పరిణామం ఏమిటో అంతుబట్ట లేదు.

పొలికేక వినబడే సరికి ఏమయ్యిందో అనుకుని రత్నం కూడా పరిగెత్తుకుంటూ వచ్చింది.

పరంధామయ్య వచ్చీ రాగానే...




'అమ్మనుడిని అటకెక్కిస్తారా!' సౌజన్యంతో

"ఈ ఏడాది మీరు రానంటే మాత్రం నా మీద ఒట్టే... వారికి నేనిప్పటికే మాటిచ్చేసాను. ఏర్పాట్లన్నీ జరిగిపోతున్నాయి. ఇక మీరు ఊ అంటే చాలు. కరపత్రంలో పేరు వేసేసుకుంటాను. అయినా మీరు ఒప్పుకుంటారనే నమ్మకంతో డి.టి.పి నాగేంద్రకి మీ పేరు వేసెయ్యమనే చెప్పాను. మీరు 'ఊ' అనండి చాలు... మిగిలిన పనులన్నీ నేను చూసుకుంటాను..." అంటూ పరంధామయ్య చెబుతూనే ఉన్నాడు. 'ఆన్' తప్ప 'ఆఫ్' లేని రేడియో లాగా!

అసలు నేనెందుకు 'ఊ' అనాలి? నా పేరు కరపత్రంలో ఎందుకు

వెయ్యాలి? ఒక్కముక్క కూడా అర్థం కాలేదు.

రత్నం కూడా ప్రశ్నార్థకంగా నా వైపు చూస్తోంది.

ఇక నేనే కల్పించుకుని, అతగాడి మాటల వరదకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం ప్రారంభించాను.

"ఆగవయ్యా... పరంధామయ్యా! నేనేమైనా సినిమాల్లో ఐటెం సాంగ్ చేసే నటినా?...'ఊ' అనటానికి 'ఊహూ' అనటానికి. నీ కంటికి నేనెలా కనబడుతున్నాను? అసలు నేనెందుకు 'ఊ' అనాలి? నా పేరు కరపత్రంలో ఎందుకు వెయ్యాలి?" అంటూ గద్దించి అడిగాను.

"మరేం లేదు మాస్టారూ... ఉగాది వస్తోంది కదా! మన కాలనీ ఆడిటోరియంలో వేడుకలు చేస్తున్నాం. సాయంత్రం ఆరు గంటలకు సభ మొదలు పెడదాం...పంచాంగ శ్రవణం చెయ్యటానికి మీరు తప్పనిసరిగా రావాలి... పిన్నిగారిని, పిల్లల్ని కూడా తీసుకురావాలి..." అంటూ ఆహ్వానం పలికాడు.

"అంతేకదా... తప్పకుండా వస్తాను. ఉగాది మన తెలుగు వారి పండుగ. మనం కాకపోతే ఎవరు చేస్తారు?... అందరూ కలిసి పండుగ చేసుకోవటం ఇంకా మంచిది... అలాగే చెయ్యాలి కూడా! అందరం తప్పకుండా వస్తాం అంటున్నానో లేదో...

"మహాప్రభో! జీవితం ధన్యమైంది. మీరు ఓ పట్టాన ఒప్పుకోరని, మీ దగ్గర నుంచి తేలికగా బయటపడటం సాధ్యం కాదని అందరూ అంటే భయపడి చచ్చాను. మీరింత తేలికగా




ఒప్పుకున్నారు. చాలు స్వామీ" అంటూ... పరంధామయ్య కాళ్ళు పట్టుకున్నంత పని చేసాడు.

"ఆగవయ్యా!" అంటూ అతగాడిని లేవనెత్తి, "ఇంతకీ నా పేరు కరపత్రంలో వెయ్యటం దేనికి? అందరితో పాటే నేనూ పంచాంగం వింటాను" అన్నాను.

"అదేమిటి మాస్టారూ... ఒక్కసారిగా అంత మాట అనేసారు... పంచాంగం వినటం ఏమిటి? పంచాంగం చెప్పాల్సిందే మీరే!" అన్నాడు.

"నువ్వే కదయ్యా... వస్తూనే పంచాగ శ్రవణానికి రమ్మని పిలిచావు... ఇప్పుడేమో పంచాంగం చెప్పాలంటున్నావు... మతిపోయిందా ఏమిటి?..." అనడంతో ఏం జరగబోతోందో రత్నానికి అర్థమైంది.


'ఎవరి కర్మకి ఎవరు బాధ్యులు? ఇవాల్టికి శ్రీవారికి ఆహారం కడుపునిండా దొరికింది...' అనుకుంటూ లోపలికి నడిచింది.

వెళ్తూ అలా వెనక్కి తిరిగి పరంధామయ్య వైపు చూసి... అర్థం కాని దీనమైన భావాన్ని ముఖంలో ప్రకటించింది... అతడి తలరాతను చదివిన దేవతలా!

"పరంధామయ్యా! మాట మార్చటం నాకు తెలియని పని... రాగానే నువ్వేమన్నావు?... పంచాంగ శ్రవణం చెయ్యాలి అన్నావు... శ్రవణం అంటే ఏమిటి? వినటం అని అర్థం. పంచాంగ శ్రవణం అంటే ఏమిటి?... పంచాంగం వినడం అని అర్థం. నువ్వు నన్ను పంచాంగం వినటానికి రమ్మని పిలిచావన్న మాట..." అంటూ పరంధామయ్య చెప్పిన మాటకు అర్థం విడమర్చి చెప్పాను.

నువ్వు నన్ను పంచాంగం చెప్పటానికి పిలవాలి అనుకుంటే 'పంచాంగ పఠనం' చెయ్యటానికి పిలవాలి. పఠనం అంటే చదవటం. నేను పంచాంగం చదివి, అందులో ఏముందో అందరికీ వివరంగా చెబుతాను. కాబట్టి, పంచాంగం చెప్పేవారిని 'పంచాంగ పఠనం' చెయ్యమని పిలవాలి. శ్రోతలుగా రావాలనుకున్నవారిని 'పంచాంగ శ్రవణం' చెయ్యటానికి పిలవాలి. ఈమాత్రం తెలియని వాడివి కార్యక్రమం ఎందుకు పెట్టుకున్నావు?

**(సశేషం)**







# వైభవంగా 2024 తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం!






తెలుగు కార్టూనిస్టులు, కార్టూన్ ఇష్టులు... పాల్గొని జరుపుకుంటున్న నవ్వుల పండుగ... **తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం**. తెలుగు తొలి కార్టూనిస్ట్ శ్రీతలిశెట్టి రామారావుగారి పుట్టినరోజు అయిన మే,20న హాస్యప్రియులు ఆయనని తలచుకుంటూ జరుపుకుంటున్న పండుగ ఇది.

డా॥కె.వి.రమణగారి ఆశీస్సులతో, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో హాస్యానందం, సత్కాళాభారతి, నిర్వహించిన **13వ 'తెలుగు కార్టూనిస్టల దినోత్సవం'** మే 20 సాయంత్రం హైదరాబాద్, రవీంద్ర భారతి సమావేశ మందిరంలో వైభవంగా జరిగింది.

ఈ సభకు ముఖ్యఅతిథులుగా–తెలంగాణ రాష్ట్ర భాషాసాంస్కృతిక సంస్థ సంచాలకులు–శ్రీమామిడి హరికృష్ణ, సాంఘిక సేవకురాలు–శ్రీమతి సత్యవాణి, ఆధ్యాత్మికవేత్త–శ్రీదైవజ్ఞశర్మ, హాస్యనటులు, రచయిత– శ్రీహర్షవర్ధన్, కార్టూనిస్టు, సాహిత్యకారులు–శ్రీసుధామ, కార్టూనిస్టు– శ్రీశంకు, బాపూరమణ అకాడమీ కార్యదర్శి– శ్రీవి.సుబ్బరాజు, చిత్రకారులు, కార్టూనిస్టు– శ్రీఉత్తమ్ పాల్గొన్నారు.

శ్రీ బి.ఎస్.శర్మగారు సభని నిర్వహించగా, ముఖ్య అతిథులను శ్రీమతి ప్రియాంక వేదిక పైకి ఆహ్వానించగా, అతిథులను దుశ్శాలువలతో అక్షజ్ఞ ప్రచురణకర్త శ్రీవెంకట్ సత్కరించారు. హాస్యానందం సంపాదకులు శ్రీ పి.రాము స్వాగతోపన్యాసం చేశారు.

ప్రార్థన గీతంతో మొదలయిన ఈ సభలో ముందుగా **'కార్టూన్‌మిత్ర 2024 పురస్కారం'** శ్రీ కె.వి.వి.సత్యనారాయణ గారికి ముఖ్య అతిథులు అందజేసారు.

తదుపరి తలిశెట్టి రామారావు స్మారక కార్టూన్ పోటీ విజేతలకు బహుమతులు,'బాపు రమణపురస్కారం', 'శేఖర్ అవార్డు, బ్నిమ్మానందం కార్టూన్ పోటీ విజేతలకు బహుమతులు ముఖ్య అతిథులు అందజేసారు.

ప్రముఖ కార్టూనిస్టు శ్రీజయదేవ్‌గారు స్థాపించిన 'జయదేవ్ రాజలక్ష్మీ కార్టూన్ అకాడమీ' సమర్పించిన **'కృష్ణ కారూన్లు'** పుస్తకం శ్రీమామిడి హరికృష్ణ ఆవిష్కరించారు.

వందన సమర్పణ శ్రీ యదుమోహన్ గావించారు.

సభకి ముందు... అల్పాహారం, సమ్మర్ స్పెషల్ 'మామిడి పండ్ల రసం' హాస్యానందం వారు అందించారు. **–వి.కె.రాజశేఖర్, హైదరాబాద్**







## పురస్కారాలు





గత ఎనిమిదేళ్ళుగా హాస్యానందంలో ప్రతినెలా ఒక మంచి కార్టూన్‌కి 1000 రూపాయలు ప్రోత్సహక బహుమతి అందజేస్తున్న **శ్రీ కె.వి.వి.సత్యనారాయణ గారికి 'కార్టూన్‌మిత్ర 2024 పురస్కారం'** ప్రదానం.



**తలిశెట్టి రామారావు పురస్కారం-2024** విజేత **శ్రీకామేష్ (మొదటి బహుమతి)**



**బాపురమణ పురస్కారం-2024** విజేత **శ్రీగోపాలకృష్ణ**



**శేఖర్ అవార్డు-2024** విజేత **శ్రీ గాంధీ**



సభ నిర్వహణ- **శ్రీ బి.ఎస్.శర్మ**



ముఖ్య అతిథులను వేదిక పైకి ఆహ్వానిస్తున్న **శ్రీమతి ప్రియాంక**



ప్రార్థన గీతం ఆలపిస్తున్న **మిత్రురాళ్ళు మల్లిక, లక్ష్మి**

# తలిశెట్టి రామారావు స్మారక కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం



రెండవ బహుమతి- డి.శంకర్



మూడవ బహుమతి- సునీల్

## ప్రత్యేక బహుమతులు



దేవిడ్



ఆనంద్ గుడి



శర్మ



బీవీఎస్



మోహన్ కుమార్



భాను



రాజశేఖర్



సుబ్బు



కృష్ణ



అరుణ్



ప్రణు



సునీల



చక్రవర్తి



కాశ్యప్



ఓంకార్



తోపల్లి ఆనంద్



గిరి(వీరి పిల్లలు)



కన్నాజీరావు (వీరి సోదరులు)



బ్నిమ్మానందం కార్టూన్ పోటీ విజేతలలో ఒకరైన శ్రీ లేపాక్షిగారి బదులు శ్రీ బాచిగారు బహుమతి అందుకున్నారు. మిగతా ఇద్దరికీ త్వరలో బహుమతులు అందజేస్తాం!



జయదేవ్‌రాజలక్ష్మి కార్టూన్ అకాడమీ సమర్పించగా హాస్యానందం ప్రచురించిన 'కృష్ణ కార్టూన్లు' పుస్తకావిష్కరణ






కథ-కథనం

**యండమూరి వీరేంద్రనాథ్**

**యర్రంశెట్టి శాయి**



# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** రంభ, ఊర్వశి, తిలోత్తమలు ముగ్గురూ కలిసి ప్రారంభించిన 'మన్మధా మెన్స్ బ్యూటీ పార్లర్' మూడవ బ్రాంచి ప్రారంభంతో పాటు 'మేడ్ ఫర్ ఈచదర్' పోటీని ప్రకటించారు. ఆ పోటీలో పాల్గొన డానికి దేవలోకంలో అందరూ సిద్ధమవుతున్నారు... ఈలోగా మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. భర్తతో సవాలు చేసి సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. స్కూలు వదిలాక అందరూ వెళ్లి పోయాక... అదే స్కూలు తాలూకు కెమిస్ట్రీ ల్యాబులో రహస్యంగా ప్రయోగాలు చేస్తూ ఉంటాడు. **ఆ తర్వాత...**

**(ఏప్రిల్ నెల తరువాయి)**

**పొగ కొంచెం పీల్చినా స్పృహ తప్పి పడిపోవటం ఖాయమన్న విషయం బషీర్‌కి అనుభవపూర్వకంగా తెలుసు!**

**ఏడాది క్రితం ఇలాగే చంద్రబోసు పక్కన నిలబడి పీల్చేసరికి నలభై ఎనిమిది గంటలు స్పృహ లేకుండా పడిపోయాడు. అలా పొగలు వచ్చిన ప్పుడు మరో ద్రావకంలో ముంచిన గుడ్డ ముక్కుకి కట్టుకోవాలని చెప్పాడు చంద్రబోస్!**

**ఆ రోజు నుంచీ బషీర్ మళ్ళీ స్పృహ తప్ప లేదు. గుడ్డ కట్టుకోవటం వలన కాదు. బోసు పరిశోధనలకు దూరంగా ఉండటం వలన!**

బషీర్ దూరంగా జరిగి నిలబడ్డాక...చంద్రబోసు తన కోటు జేబులో నుంచి కాళ్ళూ, చేతులూ (లేదా నాలుగు కాళ్ళూ) బంధింపబడి ఉన్న ఎలుకను బయటకు తీశాడు.

దాని పేరు జూకా.

ఎలుక కట్లు విప్పి... ఆ పొగ వచ్చే చోట వేలాడ దీశాడు. అది స్పృహ తప్పిన వెంటనే తను ప్రత్యేకంగా తయారు చేసిన చెక్క పెట్టెలో పడేశాడు.

ద్రావకం నుంచి వస్తూన్న పొగ ఆగి పోయింది.

ఆ ఎలుక వంకే చాలాసేపు చూస్తూ కూర్చుండి పోయాడు చంద్రబోసు. అతని ముఖంలో అంత వరకూ కనిపించిన ఆత్రుత ఛాయలు తొలగిపోయి, విషాద ఛాయలు ప్రవేశించాయి.

బషీర్ చంద్రబోసు దగ్గరకు వెళ్లి- "సార్!" అంటూ దీనంగా పిలిచాడు.

"ఊఁ!..." చంద్రబోసు తలెత్తకుండానే అన్నాడు.

"ఎందుకు సార్? రోజూ చేసిన పరిశోధనే మళ్ళీ మళ్ళీ చేస్తూ ఆ ఎలుకలతో పాటూ మమ్మల్నీ చిత్రహింస పెడు తున్నారు?"

హఠాత్తుగా చంద్రబోసు ల్యాబ్ టేబిల్ మీద తల వాల్చేసి వెక్కి వెక్కి ఏడవసాగాడు.

బషీర్ కంగారు పడి బోసు భుజం కుదిపేస్తూ-

"ఏమిటి సార్? ఏం జరిగింది?" అన్నాడు.

చంద్రబోసు చాలా సేపటికి దుఃఖం నుంచి తేరు కున్నాడు.

"నేను చిన్నప్పటి నుంచీ ఏం కలలు కనే వాడినో తెలుసా బషీర్! ఎప్పటికయినా జగదీశ్ చంద్రబోసులాంటి గొప్ప సైంటిస్ట్‌ని అవాలని అనుకునేవాడిని!... నేను కని పెట్టిన 'బోసు కాన్సంట్రేటెడ్ ఎయిర్-గ్యాస్' వలన... మన దేశపు రక్షణాదళాలకు ఎంత బలం చేకూరుతుందో తెలుసా?"

"తెలుస్సార్!"

చంద్రబోసు ఆశ్చర్యపోయాడు.

"ఎలా తెలుసు?"

"మీరే ఇప్పటికి ఇరవైసార్లు చెప్పారు సార్!"

"చెప్పానా? గుర్తు లేదే... చెప్తే మళ్ళీ చెప్తా విను. ఈ గ్యాస్ ఒక బాటిల్లో నింపి శత్రు బంకర్ల మధ్యలో పడేస్తే, రెండు కిలోమీటర్ల విస్తీర్ణంలో మనుషులూ, జంతువులూ స్పృహ తప్పి పడిపోతాయి. అంతేకాదు బషీర్! రోడ్డు మధ్యలో... రాజకీయనాయకులు ధర్నాలు చేసినా, ట్రాఫిక్ ఆపుచేసినా, వందల సంఖ్యలో జనం గుంపులు గుంపు లుగా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టు ముట్టినా వారితో ఘర్షణ పడే అవసరం ఉండదు. లాఠీ ఉండదు! ఆడ



కార్యకర్తల్ని మగపోలీసులు బలవంతంగా పోలీసు వ్యానుల్లో ఎక్కించే వీలుండదు... ఈ సీసా వాళ్ళ మధ్యలో పడేస్తే చాలు! స్పృహ తప్పిన శరీరాల్ని అలాగే తీసుకెళ్ళి శ్మశానంలో పడెయ్యొచ్చు. మెలకువ వచ్చాక వాళ్ళే ఇంటికి పోతారు!" అని ఆగి...

"చూశావా! ఎంత గొప్ప ఆయుధం కనుక్కున్నానో?" అన్నాడు.

"చూశాను... చూస్తున్నాను... చూస్తాను...చూస్తూనే ఉంటాను సార్!" గ్రైప్‌వాటర్/ సువర్ణభూమి అడ్వర్టయిజ్మెంట్ (తరతరాల చిరునామా) లెవెల్లో అన్నాడు బషీర్.

"ఈ విషయం గురించి నేను మన రక్షణమంత్రికీ, ప్రధానమంత్రికీ ఉత్తరాలు వ్రాశాను బషీర్!" చంద్రబోసు విషాదంగా అన్నాడు.


"...నువ్వు నమ్ముతావో నమ్మవో... ప్రధానమంత్రికి కచ్చితంగా చేరుతుందని ఓ ఉత్తరానికి స్టాంపులు కూడా తక్కువ పెట్టాను... అయినా వాళ్ళు నన్ను ఆహ్వానించలేదు. కనీసం ఫార్ములా వివరాలు కూడా అడగలేదు. ఇక నేను ఓపిక పట్టలేను బషీర్. ఇదే ఆఖరి ప్రయోగం. ఇది చూసి ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాను."


కళ్ళజోడు తీసి ఓసారి తుడిచి మళ్ళీ పెట్టుకున్నాడు.

"నా పరిశోధనలన్నిటికీ చిరునవ్వుతో సహకరించిన నీకూ, ఓర్పుతో వప్పుకున్న నా ఎలుక ఫ్రెండ్ 'జూకా' కీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నా పేరు పక్కనే మీ ఇద్దరి పేర్లూ సైన్స్ చరిత్రలో అపూర్వంగా నిలిచిపోతాయని ఆశ పడ్డాను. కానీ ఏమీ చేయలేక పోయాను. అయాం రియల్లీ సారీ."

"పర్లేదు సార్! వచ్చే జన్మలో చేద్దురు గాని."

"థాంక్యూ బషీర్!... కనీసం నా భార్య అయినా నీలాగా అర్థం చేసుకునే మనస్తత్వం ఉన్నదయితే ఎంతో సంతోషించేవాడిని. కానీ ఎంతసేపూ తెలుగు సంధులు, తమిళనాడు చీరలూ, టి.వి సీరియల్సే జీవితమనుకుంటోంది. హుఁ! టీవి మీద ఉన్న ప్రేమలో పదోవంతు నామీద ఉంటే బ్రతికేవాడిని... జీవితం అశాశ్వతం. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాను."






అశాశ్వతానికి, ఆత్మహత్య చేసుకోవటానికి సంబంధం ఏమిటో బషీర్‌కి అర్థం కాలేదు. అయితే ఈ రోజు నుంచీ మిగతా గదులతో పాటూ కెమిస్ట్రీ ల్యాబ్ కూడా తాళం వేసుకుని పోవచ్చని అతడికి ఆనందంగా ఉంది.

అర్ధరాత్రి చంద్రబోసు పని పూర్తి చేసుకుని వెళ్ళేటప్పుడు వాచ్‌మెన్‌కి తాళం చెవులు ఇచ్చి పోతూంటే, ల్యాబ్‌లో స్పిరిట్ అంతా వాడు తాగేస్తున్నాడు. మానేజ్‌మెంట్‌కి ఈ విషయం తెలిసి తన ఉద్యోగం పోయే ప్రమాదం ఇప్పుడు తప్పింది.

"మరి ఇక వెళదామా సార్?"

చంద్రబోసు హైడ్రోక్లోరిక్ ఆసిడ్ సీసా ముందు నుంచి లేచి... బయటకు వెళ్ళి నిల బడ్డాడు.

బషీర్ తలుపులు మూసి తాళం వేసేశాడు.

ఇద్దరూ స్కూలు బయటకు నడిచారు.

"బషీర్! నాకో సహాయం చేస్తావా?"

"చెప్పండి సార్!"

"జూకాకి స్పృహ రాగానే తీసుకెళ్ళి మా ఇంట్లో వదిలేసెయ్!"

బషీర్ ఆశ్చర్యపోయాడు.

"ఎందుకు సార్?"

"మా ఆవిడని ముప్పతిప్పలు పెట్టగలిగేది అదొక్కటే బషీర్! నిద్రలో చెవి కొరకటం, అర్ధ రాత్రి కాళ్ళమీద పాకటం, చీరెలో దూరి కెవ్వున అరిచేలా భయపెట్టటం... ఇలాంటి పనులన్నీ అదొక్కటే చెయ్యగలదు."

"ఈ పనులన్నీ మీరే చేసి భయపెట్టవచ్చు కదా సార్!"

"నేను చెప్పేది నీకు అర్థం కావటం లేదు బషీర్! బీరువాలో పట్టు చీరెలు కొట్టెయ్యటం, వంటింట్లోవి తినెయ్యటం, రాత్రిళ్ళు గిన్నెలు పడగొట్టి నిద్ర చెడగొట్టటం... అలా నరకం చూపించేదనుకో. అందుకే మా ఆవిడ దాన్ని చంపాలని పగ బట్టింది. ఎంత ప్రయత్నించినా అది దొరకలేదు... చివరికి నేనే దాన్ని నా పరిశోధనల కోసం ప్రేమగా పెంచుకుంటు న్నాను. ఇప్పుడు నేనెలాగూ ఆత్మహత్య చేసు కుంటున్నాను గనుక, ఆ ఎలుక మళ్ళా మా ఆవిడను నానా తిప్పలు పెట్టాలి. అప్పుడే నర కంలో నా ఆత్మకు శాంతి!"

"శాంతి నరకంలో కాదు... స్వర్గంలో ఉంటుంది అని చెప్పారు సార్ నాకు!"

"శాంతి ఎవరు?"

"అదే సార్... స్వర్గంలో 72 దేవకన్యల గురించి కాశ్మీర్లో మా గురువు చెప్పారు... వాళ్లలో శాంతి ఒకృత్తి కాదా?"

గాఢంగా నిశ్వసించి– "నేను ఇంత సీరి యస్‌గా నా చావు గురించి చెప్తోంటే, నీకు స్వర్గంలో దేవకన్యలు గుర్తొచ్చారా బషీర్?" అన్నాడు.


"లేదు సార్! ఆ విషయం చెప్పిన మా బాస్ గుర్తొచ్చాడు!"

"ఇంతకీ నేను చెప్పిన పని చేస్తావా బషీర్?" తడి కళ్ళతో అడిగాడు.

"తప్పక చేస్తాను సార్... ఆరు మూడైనా మూడు ఆరైనా, మీరు ఆరూ తొమ్మిది బాటిల్ ఇవ్వక పోయినా మీ ఆఖరి కోరిక నెరవేరు స్తాను!"

"థాంక్స్ బషీర్!"

"మీ ఆవిడ నిద్రపోతూ ఉండగా ఎలకను



తీసుకెళ్లి ఆవిడ మీద వదలాలి... అంతేగా!"

బోసు కంగారుపడి–

"నువ్వు బెడ్ రూములోకి వెళ్ళ నవసరం లేదు బషీర్... కిటికీ లోంచి వదులు చాలు" అంటూ అతని చేతిని తన చేతిలోకి తీసుకొని ఆప్యాయంగా కరచాలనం చేసి చకచకా జనంలో కలిసిపోయాడు.

ఆపై వేగంగా అడుగులు వేస్తూ ఊరి బయటకు చేరుకున్నాడు.

✦✦✦

చిట్టడవి మధ్య కొండ చరియ ఎక్కాడు.

అక్కడ అంతా నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉంది!

"ఈ అద్భుత మేధావి గురించి రేపు ప్రపంచానికి తెలుస్తుంది. అప్పుడు ఏడుస్తారు" అని అనుకుంటూ.. జేబులో కాగితం తీసుకుని ఆఖరిసారి చదువుకున్నాడు.

నా ఆత్మహత్యకి కారణం...

1. నా భార్య.
2. నా హెడ్ మాస్టారు.
3. ప్రధాన మంత్రి

కాగితం చదివి జేబులో పెట్టుకుని లోయలోకి దూకబోయాడు.

✦✦✦

ఆకాశం నుంచి అతనినే గమనిస్తోన్న ఇంద్రసతి ముసిముసిగా నవ్వుకుంది.

పరిశోధనలో విఫలుడిగా చేసి, భార్యను గయ్యాళిగా మార్చి, చివరికీరోజు ఏకంగా శివకైవల్యానికి సిద్ధం చేసింది. తనకి అప్పచెప్పిన మొదటి పని ఆ విధంగా పూర్తయింది!

ఆమె అలా సంతోషిస్తూ ఉండగా... సరిగ్గా అదే సమయానికి సరస్వతి ఉలిక్కిపడి నిద్ర లేచింది.

మహిషాసుర మర్ధిని వికటాట్టహాసం చేస్తూ ఎదురుగా నిలబడినట్టూ కల.

పార్వతి గుర్తు రావటంతో తను సృష్టించిన మానవ జంటల సంగతి గుర్తొచ్చింది.

'ఎలా ఉన్నారో' అనుకుంటూ దివ్యదృష్టితో వెతికింది.

అప్పుడే చంద్రబోసు లోయలోకి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్నాడు.

ఆమెకు మతి పోయినట్లయింది.

ఏం జరిగిందో, ఎందుకు అతను ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడో అదంతా తరువాతి సంగతి ! ముందు చంద్రబోస్‌ని రక్షించాలి..! లేకపోతే తను దారుణంగా ఓడిపోయినట్లవుతుంది!

వెంటనే బోసు దగ్గరకు ఒక వ్యక్తిని పంపించింది.

✦✦✦

"ఆగండి గురూజీ" అన్న కేక విని ఉలిక్కిపడి అటువేపు చూశాడు చంద్రబోస్.

చిరునవ్వుతో బీడీ కాలుస్తూ ఒక యువకుడు... సారీ... బీడీ కాలుస్తూ చిరునవ్వుతో ఒక యువకుడు బోసు దగ్గరకొచ్చాడు.

"నా పేరు జీరో–జీరో–జీరో! హ్హా...హ్హా..."

చంద్రబోస్‌కి అర్థం కాలేదు.

"ట్రిబుల్ జీరోనా?... ఎవరు నువ్వు?... ఏం చేస్తూ ఉంటావు?" అని అడిగాడు.

"ఇండియాలో రహస్యంగా పడుకుంటాను."


బోసు మరింత అయోమయం చెందాడు.

"ఇండియాలో రహస్యంగా పడుకుంటావా?

నవ్వు కొమ్మచ్చి





అంటే ముసుగు కప్పుకునా? అయితే ఇంతకీ నేనేం చెయ్యాలి?"


"నేను విదేశీ గూఢచారిని!"

"ఓహో... సీక్రెట్ స్లీపర్ వా?"

"అవును. స్లీపింగ్ ఇన్ ఇండియా. హ్హి...హ్హి" అన్నాడు.

హ్హి...హ్హి...అన్న నవ్వు అతడికి పుట్టుకతోనే వచ్చింది. పుట్టినప్పుడు పొత్తి కడుపు తుడుస్తూన్న నర్సుని చూసి 'హ్హి...హ్హి...' అని నవ్వి, పాపం ఆ పెద్దావిడని కంగారు పెట్టాడు.

అతడి నవ్వులో స్పెషాలిటీ ఏమిటంటే... అతడు నవ్వినప్పుడు సైలెన్సర్ పాడయిన లారీ శబ్దం వస్తూ ఉంటుంది.




"హ్హి...హ్హి... నువ్వు కనిపెట్టిన కాన్సంట్రేటెడ్ గ్యాస్ గురించి మాకు తెలిసింది. అది గానీ నువ్వు పాకిస్తాన్‌కి అమ్మేశావంటే బోలెడు డబ్బు! అంతా అమెరికన్ డాలర్లలోనే!"

"అది నా జీవితం సర్వస్వం ధారపోసి కనుక్కొన్నది... కంఠంలో ప్రాణం ఉండగా శత్రు దేశాలకు అమ్మను!" అన్నాడు.

"నీ ప్రాణం ఎలాగో పోతుంది కదా!... నీ గ్యాసుని...అదే... నువ్వు తయారు చేసిన గ్యాసుని నీవు పోయిన తరువాతే వాడుకుంటాము.. హ్హి... హ్హి... ఆ ఫార్ములా మాకిస్తే మీ ఆవిడకు లక్షల కొద్దీ డాలర్లొస్తాయి!"

"మా ఆవిడకా?... అయితే చచ్చినా చిత్రహింసలు పెట్టినా అమ్మను!"

"దాన్ని అనాథాశ్రమాలకి డొనేషన్ ఇస్తే ... పుణ్యం వస్తుంది. ఆ పుణ్యంతో నువ్వు చచ్చాక జీవితాంతం స్వర్గంలో... షకీలా డాన్సు చూడొచ్చు!"

చంద్రబోస్‌కి చిరాకేసుకు వచ్చింది.

"నీకు తెలుగు ఎవడు నేర్పాడ్రా?"

"హ్హి...హ్హి... ఎందుకు సార్?"

"చచ్చిపోయిన తరువాత జీవితాంతం ఏమిట్రా? పైగా స్వర్గంలో ఉండేది షకీలా కాదు! రంభ!!"

"ప్రస్తుతం పత్రికాఫీసులో... స్లీపరుగా ఉన్నాను. మా తెలుగు అలాగే ఉంటుంది. హ్హి...హ్హి..." అన్నాడు.

అంతలో అతడి స్వరం కఠినంగా మారింది.

"...ఆఖరి మాట చెప్పు!... ఇస్తావా షూట్ చేసి చంపెయ్యమంటావా?"

"ఆత్మహత్య చేసుకోబోయే వాడిని చంపి బుల్లెట్ వేస్ట్ చేస్తావ్రా? శోభనం పెళ్లికొడుక్కి స్లీపింగ్ టాబ్లెట్లు అమ్ముకునే వెధవా! ఎవడ్రా నీకు ఉద్యోగం ఇచ్చింది? అందుకే మీ దేశం అలా ఆర్థికమాంద్యంతో ఏడుస్తోంది."

"ఫార్ములా చెప్పక పోతే... నువ్విక్కడ ఆత్మహత్య చేసుకుంటున్నావని... నీ భార్యకి ఫోన్ చేసి చెప్తాను!"

"చెప్పు! అది తెలిస్తే... ఈ ప్రపంచంలో అందరి కన్నా ఎక్కువ ఆనందించే వ్యక్తి తనే! వన్-టూ-త్రీ అనే లోపల ఇక్కడి నుండి వెళ్ళకపోతే నేనే పోలీసులకి ఫోన్ చేస్తాను!"

త్రిబుల్‌జీరో గతుక్కుమని...


"అంత కోపమెందుకు సార్! మీరు కాకపోతే ఇంకో సైంటిస్ట్‌ని పట్టుకుంటాం. లక్షల డాలర్లు వాడికే ఇస్తుంది మా దేశం. హ్హి...హ్హి... బైదిబై తిరిగి వెళ్ళటానికి ఒక రూపాయి ఉంటే ఇస్తారా? పాకిస్తాన్ నుండి ఫండ్స్ రాగానే ఇచ్చేస్తాను. మీరన్నట్టు మా దేశంతో పాటూ నేనూ ఆర్థికమందంలో ఉన్నాను!"

"మందం కాదు. మాంద్యం. ఇవ్వను!"

"ఓకే. ఓకే. హ్హి...హ్హి... నో ప్రాబ్లం. మళ్ళీ కలుసుకుందాం. వస్తా!" అని ఆగి...

"పోనీ 'టీ' కి పది పైసలయినా ఉందా?" అని అడిగాడు.

"లేదు. ఎలాగూ ఛస్తున్నానని జేబులో డబ్బులంతా మా బషీర్‌కి ఇచ్చేశాను." **(సశేషం)**






గంగాధర్ వడ్లమన్నాటి-
9908445969

## రెస్ట్ తీసుకునే గది

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

తర్కారావ్ గొంతు సవరించుకుని, "గబ గబా బాత్రూంలోకి వచ్చిన మధు, అక్కడ వెంగళరావుని చూసి ఆశ్చర్యపోయాడు. కారణం, అతను ఆ పెద్ద బాత్రూంలో ఒక పక్కగా హాయిగా చలనం లేకుండా పడుకున్నాడు. అది నిజమో, భ్రమో అర్థం కాక... ఒకసారి తన కళ్ళని గట్టిగా నులుముకుని, మళ్ళీ చూసాడు.

అవును అక్కడ పడుకున్నది వెంగళరావే అని రూఢీ చేసుకున్నాక... కొంపదీసి స్పృహ తప్పి పడిపోయాడా... అని కాస్త వంగి అతని మొహంలో మొహం పెట్టి పరీక్షగా చూశాడు.

"సందేహం లేదు! అతను పడిపోలేదు, పడుకున్నాడు." అని కాస్త బుర్ర గోక్కుని... "ఏవయ్యా వెంగళరావ్! ఒంట్లో బాలేదు అని అడిగి, ఇక్కడికి వచ్చి పడుకున్నావా?" అడిగాడు ఆశ్చర్యంగా.

మధు మాటలకి బద్ధకంగా పైకి లేచి... తర్వాత "ఆవ్వా!" అని ఆవులా ఆవులించి... "అదేంటండి అలా మాట్లాడతారు! ఎక్కడో మారుమూల ఊరు నుండి వచ్చాను కదా అని నన్ను తక్కువగా చూడకండి. మీరే కదా రెస్ట్ తీసుకో అని పర్మిషన్ ఇచ్చారు. అందుకే ఇక్కడ రెస్ట్ తీసుకుంటున్నాను. నేను చేసింది తప్పా? చెప్పండి!!" అడిగాడు సీరియస్‌గా.

ఆ తింగరి సమాధానంతో, ఆవదం మొహం పెట్టి- "అవును నేనే రెస్ట్ తీసుకోమన్నాను, నిజమే! కానీ, దానికి కింద ఒక రూమ్ ఉంది కదా, మరి ఇక్కడికి వచ్చి పడుకున్నావేవిటీ అని అడుగుతున్నాను." ముఖం చిట్లిస్తూ కాస్త పెద్ద స్వరంతో అడిగాడు.

వెంగళరావ్ ముఖం చిట్లిస్తూ... "నేనంటే మీ పట్నం వాళ్ళకి చులకనండి, అందుకనే నేను రెస్ట్ తీసుకునే గది గురించి అడిగితే, ఇక్కడ, ఈ గదిలో రెస్ట్ తీసుకోమని చెప్పాడు ఆ పొడుగోడు!" ఆశ్చర్యంగా చూస్తూ "ఎవరు నిన్ను ఇక్కడ పడుకోమన్న ఆ పొడుగోడు?" అడిగాడు మధు.


ఒక వేలితో బుర్ర గోక్కుంటూ... "అతనే ఓ వ్యక్తి పొడుగ్గా ఉంటాడు చూసారా?" అని ఓ క్షణం ఆలోచించి... "ఆ...ఆ వ్యక్తి పేరు గిరి."

చెప్పగానే అతన్ని పిలిచాడు మధు. తర్వాత అతను చెప్పిన సమాధానం విని... "వెంగళరావ్! దీంట్లో అతని తప్పూ లేదూ, నీ తప్పు లేదూ! " అని వెంగళరావుకి అసలు విషయం వివరించడంతో...

"అలాగా! అయాం సారీ!" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

"ఇప్పుడు చెప్పు సుబ్బారావు! వెంగళరావ్ అక్కడ పడుకోవడానికి గిరి కారణం అని చెప్పాడు. అయితే మధు అడిగాక, అతని తప్పులేదు అని తేలింది. అసలు గిరి, అతన్ని విశ్రాంతి కోసం బాత్రూంకి వెళ్ళమని చెప్పడానికి కారణం ఏమిటి?" అడిగాడు తర్కారావ్.

"సింపుల్ సార్! అతన్ని ఇటు వైపు విశ్రాంతి గదికి వెళ్లమంటే, వెంగళరావ్ అయోమయంతో అటు వైపు ఉన్న బాత్రూంకి వెళ్ళిపోయి, అక్కడే పడుకుండిపోయాడు... అంతేనా?" అడిగాడు సుబ్బారావ్.



"కాదు తమరి బొంద! వెంగళరావు గిరిని అడిగింది రెస్ట్‌రూమ్ ఎక్కడ అని. అంటే, విశ్రాంతి తీసుకునే గది ఎక్కడా అని. బాత్రూంని రెస్ట్‌రూమ్ అని కూడా అంటారు కదా? అందుకని గిరి, రెస్ట్‌రూమ్ గురించే అడిగాడనుకుని, అటువైపు చూపించాడు.

పట్నంలో ఇంతేనేమో అనుకుని, వెంగళరావ్ అక్కడే పడుకున్నాడు, అదీ జరిగింది.


వెంగళరావుకి, రెస్ట్‌రూమ్ అంటే బాత్రూం అనీ, విశ్రాంతి గదులను కార్పోరేట్ ఆఫీసుల్లో నేప్‌రూమ్ అని అంటారని చెప్పడంతో, విషయం అర్థం చేసుకున్నాడు. అదీ జరిగింది...

నువ్ ఈ సారి కూడా చెప్పలేక పోయావ్ కనుక, ఈసారి కూడా నీ జీతం పెంచడం జరగదు" అని తర్కారావు చెప్పడంతో...

"మీ తర్కం మీదే కానీ, నా తరపు అర్థం చేసుకోరు కదా?..." అనుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు సుబ్బారావు.

సరికొత్త సరదా శీర్షిక

# వాక్చిత్రం



సుధామ–9849297958

హాస్య'శ్రమా'నందం

**మేడే అంటే శ్రమకు గుర్తు!**

**శ్రమ చేసి కూలీలు కట్టగలిగేది కూడా 'మేడే!'**

**'కష్టేఫలి' అన్నారు. కష్టం ఫలిస్తుందంటే ఆ ఫలం తియ్యగా ఉండాలి. మిగలమగ్గిపోవడమో, కుళ్లిపోవడమో కాకూడదు మరి!... అందరి శ్రమలూ ఒకేలా ఫలితాన్నిస్తాయా? అంటే చెప్పలేం! శ్రమలో కూడా అంతస్తులు ఉన్నాయండోయ్!**

మేస్త్రీ ఒక కూలితో–

"ఏమిటోయ్!... అందరూ రెండు చేతుల తోనూ, నెత్తి మీదా ఇటుకలు మోస్తుంటే నువ్వు ఒక్కొక్క ఇటుకే పట్టికెడు తున్నావ్?" అని అడిగితే...

ఆ కూలీ "వాళ్ళకు శ్రమ పడడానికి బద్ధక మండీ!... చాలాసార్లు తిరగవలసి వస్తుందని!" అని సమాధానం ఇచ్చాడట!

అంచేత బరువులెత్తడంలో 'బద్ధకిస్టు' నిర్వ చనం వేరు.

ఇల్లాలు షాపింగ్‌కు వెళ్లిందంటే – ఆవిడ కొన్నవి ఇంటికి మోసుకొచ్చే బరువు బాధ్యతలు శ్రీవారివే!

కానీ షాపింగ్ చేసిన 'శ్రమ' అంతా పాపం శ్రీమతే ఫీలయిపోతుంది.

'కార్మికులు' అంటే 'కారు మీకు నడిపేవారు' అని డ్రైవర్స్ సంఘం వారన్నమాట!

సంసార బాధ్యత అనే శ్రమ పడలేని వారికోసమే 'డైవర్స్' అనేది వచ్చిందని ఓ మహిళా సమాజం తీర్మానించిం దట!

అసలు ఏది 'శ్రమ' అనేది ఒక మిలియన్ డాలర్ల క్వశ్చెన్ కొందరికి.

"ఏవోయ్! ఇందాక నేను రాస్తున్న పెన్సిల్ ఎక్కడ పెట్టాను?" అని అడిగితే...

"మీ చెవికే పెట్టుకున్నారు కదండీ!" అని ఆవిడ అంటే...

"కుడి చెవా? ఎడమ చెవా? సరిగ్గా చెప్పి ఏడు!!" అని ఆ పతిదేవుడు కసురుకున్నాడట!

ఏ పాటి శ్రమ ఎవరు పడాలో ఆయనదే నిర్దేశం అన్నమాట!

నిజానికి శ్రమ అనేది తగ్గించడానికే సాంకే తికత వచ్చింది.

రుబ్బు రోళ్ళు, రోకళ్ళు, చేటలు, కట్టె పొయ్యిల కాలం ఎప్పుడో పోయింది.

మిక్సీలు, గ్యాస్‌స్టవ్‌లు గ్రైటాలు వచ్చి శ్రమను తగ్గించాయి.

ఆ మాట కొస్తే యంత్రాలు అన్నీ శారీరక శ్రమను తగ్గించడానికి వచ్చినవే!... ఇప్పుడి ప్పుడే రోబోలు వచ్చేసాయి. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వచ్చాక తెలివితేటలు వాడాల్సిన మెదడు శ్రమ కూడా తగ్గిపోతోంది.

రోజువారీ పనుల్లో శ్రమ తగ్గించే సదు పాయాలు బోలెడు వచ్చేసాయి.

"వెధవ సంత... వెధవసంత అని!... ఆ స్విచ్చులు వేసీ వేసీ, ఆ బటన్లు నొక్కీ నొక్కీ నా వేళ్ళు నొప్పెడుతున్నాయి. ఇంత శ్రమ పడాల్సి వస్తుందనుకోలేదు!" అని వాపోయే వాళ్ళు ఇవాళ తారసపడుతున్నారు అంటే 'శ్రమ' ఏ స్థాయిలో వుందో మనం అర్థం చేసు కోవాలి మరి!

'శ్రమయేవ జయతే!' అన్నారు.

శ్రమ పడితేనే జయం మరి! ఎలాంటి శ్రమ



పడకుండా అన్నిట్లో జయం లభించాలని ఆరాట పడేవారు ఎక్కువైపోతున్నారు.

పైగా ఆ ఆరాటమే పెద్ద శ్రమగా ఫీలయి పోతున్నారు కూడాను!


కార్మికుల పనిగంటలను తగ్గించి క్రమబద్ధీకరించడం జరిగిన శుభ సందర్భం మే ఒకటవ తేదీ అని దానిని 'మేడే' అన్నారు!

అసలు కార్మికులు, కర్మాగారాలు అంటేనే కమ్యూనిజం అనీ... అన్నిటికీ పరమౌషధం 'మార్క్సిజం' అనీ నమ్మి... ఆ శ్రమ భావనకే మార్కులు వేసేవారున్నారు.

అందరినీ నవ్వించాలనుకునే కార్టూనిస్టులు కూడా నిజమైన శ్రమైక జీవులు సుమండీ!

'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు?' అని అడిగితే– "ఇప్పుడు వాళ్ళెవరూ లేరండీ! అయినా ఇవాళ క్రేన్‌లూ అవీ బోలెడు వచ్చేసాయి... రాళ్ళెత్తాల్సిన శ్రమ ఎందుకు చెప్పండి?" అన్నాట్ట ఒకాయన.

కండలు కరిగించడానికి ఇప్పుడు ఎవరికీ లేవు... అందుకే 'సిక్స్ ప్యాక్' అంటూ 'జిమ్'లో చేరే కుర్రకారు తయారవుతున్నారు... అవి వచ్చాక కరిగించుకోవడానికి కాదు సుమండీ! వాటిని చూపి గ్లామర్ పెంచుకోడానికి... అమ్మాయిలను ఆకర్షించడానికో... సినిమా ఛాన్సులు కొట్టేయాలనో... ఇవాళ కండపుష్టి గల కుర్రాళ్ళ శ్రమ అంతాను!




ఆరోగ్యం కోసం పెద్ద శ్రమ పడకుండానే 'నవ్వు' అనేది వుందని అందరం గ్రహించాలి!

'సంతోషం సగం బలం' అనే మాట ఎప్పటి నుంచో వున్నదే!...

పూర్తి బలానికి పూర్తి సంతోషం అంటే హాస్యానందం అందుకోవడమే మరి!

పెదాల మీద చిరునవ్వు పూయించడానికి పెద్ద కష్టపడక్కర్లేదు. మానవ సంబంధాలు మెరుగవడానికి ఎప్పుడూ ఓ చిరునవ్వు దాల్చడం పెద్ద శ్రమ కాదు సుమండీ!

'దురిత పద్మవ్యూహాల వల్ల కానిది రవ్వంత అనురాగం వల్ల అవుతుంది' అన్నారు సినారె.

అనురాగంలో వున్నది చిరునవ్వుల వికాసమే! శక్తియుక్తుల్లో శక్తికయినా, యుక్తికయినా చిరునవ్వే మూలం!

అంచేత మీరు చేయవలసినది నవ్వుతూ వుండడం, నవ్విస్తూ వుండడం.

ఆపాటి శ్రమయే మిమ్మల్ని గొప్ప శ్రామికుడిని చేస్తుంది.

అంచేత శ్రమ శక్తి అంటే నవ్వే శక్తి మీరు పెంచుకుని పదుగురితో పంచుకుని రాణించండి!

మేడే అంటే మనం నివసించే 'నవ్వుల మేడే' అని గుర్తించండి. అదీ సంగతి!

కొత్త పుస్తకం!



ప్రఖ్యాత కార్టూనిస్టు శ్రీ జయదేవ్‌గారి శ్రీమతి కీ.శే.సౌభాగ్యవతి రాజలక్ష్మి జ్ఞాపకార్థం, **జయదేవ్‌రాజలక్ష్మి కార్టూన్ అకాడమీ** ప్రతియేడు తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా ఒక కార్టూనిస్టు కార్టూన్ల పుస్తకం హాస్యానందం సౌజన్య, సహకారాలతో వెలువరిస్తున్నారు. ఈ క్రమంలో ఈ యేడాది శ్రీకృష్ణగారి కార్టూనుల సంకలనం విడుదలయింది. 206 కార్టూన్లతో విడుదలయిన **ఈ 'నవ్వుల నజరానా' 150 రూపాయలకే అందిస్తున్నారు.**
**కొరియర్ చార్జీలు ఉచితమండోయ్!**
నవ్వడం ఇష్టపడే వారందరీ చేతిలో ఉండాల్సిన నవ్వుల బొకే ఇది. ఇంకెందుకు ఆలస్యం... ఈ కింది నెంబరుకు సంప్రదించండి!

**ప్రతులకు:**

**V. Krishna Kishore**, Comfort Classic, flat-203, Plot-112, Prashanthi hills,Road-1A Madhuranagar, Nizampet, **HYDERABAD-500090.** Phone-9247192410

# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846


## భార్యామణి

**కొ**న్ని విషయాలు రహస్యంగానే వుండేటట్టు చూసుకోవాలి... లేదూ కాదూ అని దాన్ని బట్ట బయలు చేస్తే...దాన్ని మనమే పెంచి పోషించినట్టు అవుతుంది.

అర్థం కాలేదా... అలా అయితే ఈ స్టోరీ మీకు క్లారిటీ ఇస్తుంది.

ప్రేమగా, కేరింగ్‌గా చూసుకునే భార్య వున్నా...దమయంతి అనే ఓ ఆవిడతో కోటి లింగం చీకటి బంధాన్ని ఏర్పర్చుకున్నాడు.

ఈ ఉదంతాన్ని తన భార్య కాంచనమాలకు తెలియకుండా తన చాకచక్యంతో చతురతతో కొన్నాళ్ళుగా మ్యానేజ్ చేస్తూ వస్తున్నాడు.




లంచం ఇవ్వందే ఏపనీ జరగని ఓ గవర్నమెంట్ ఆఫీసులో కోటిలింగం ఉద్యోగం చేస్తున్నాడు. స్వతహాగా కోటిలింగం మంచి లంచగొండి. దాంతో దుడ్డు బాగా గడించాడు. తన ఇద్దరి అల్లుళ్ళు కూడా ఆశ్చర్య పోయేంత కట్నం ఇచ్చి తన కుమార్తెలకు వివాహం జరిపించాడు.

చాలా వరకు మనిషి కష్టాల్లో ఉన్నప్పుడే అడ్డదార్లు తొక్కుతారు అని అమాయక జనాలు అనుకుంటారు.

కానీ... అది నిజం కాదు! సుఖాల్లో ఉన్నప్పుడే చాలా మంది పెడదారి పడతారు అని చెప్పడానికి మన కోటిలింగంగారు బెస్ట్ ఎగ్జాంపుల్.

అన్ని రోజులు మనవి కావు... అని కోటిలింగంకు బోధపడే రోజు రానే వచ్చింది.

వన్ ఫైన్ డే కోటిలింగం తన ఆఫీసులో టేబుల్ మీద తలపెట్టుకుని గుర్రు పెట్టి నిద్రపోతూ వున్నాడు. ఇంతలో టాటా, బిర్లా అనే నవయువకులిద్దరు వచ్చి కోటిలింగంకు నిద్రాభంగం చేశారు.

వాళ్ళ మీద కోటిలింగం కోపగించుకుని... కొట్టేలోగా వాళ్ళు తమ సెల్‌ఫోన్‌లో వున్న ఓ వీడియో ఆయనకు చూసే అవకాశాన్ని కల్పించారు... అందులో దమయంతిని కోటిలింగం ఎంతో ప్రేమగా కౌగలించుకోవడం రికార్డ్ అయి వుంది.

అది చూడగానే కోటిలింగం నిద్రమత్తు వదిలి పారిపోయింది... వాళ్లతో అక్కడ ఏమీ మాట్లాడకుండా వాళ్ళని తమ ఆఫీస్ క్యాంటిన్ లో ఓ మూలకు తీసుకెళ్ళీ వాళ్ళు ఏమేమి తింటారో అడిగి ఆర్డర్ ఇచ్చాడు.

“ఎవరు మీరు?... ఈ వీడియో ఎవరు తీశారు?...” అని టాటా, బిర్లాను ఆత్రుతగా, భయంగా అడిగాడు కోటిలింగం.

“సర్! కాస్త అప్డేట్ అవ్వండి... మీరు అడగాల్సిన క్వశ్చన్స్ ఇవి కావు! మాకు ఏం కావాలని అడగండి.?” అని టాటా, బిర్లా అన్నారు నెయ్యి దోశ తింటూ.

“ఓకే ఓకే. మీకు ఏమి కావాలో చెప్పండి?” అని టెన్షన్‌గా అడిగాడు.

“ఇది మీ భార్యగారికి మేము చూపించకుండా ఉండాలంట మీరు మాకు అక్షరాల యాభై లక్షలు ఇవ్వాలి!” అని అన్నారు ఇద్దరూ.

“యాభై లక్షలా?! అంత డబ్బు నా దగ్గర లేదు!”

“సార్సార్! మీ దగ్గర అంత డబ్బువుందని మేము అడగడం లేదు...ఈ వీడియో అలా డిమాండ్ చేసింది... అంతే!” కేజువల్‌గా అన్నారు ఇద్దరూ.

కోటిలింగం ఏదో ఆలోచిస్తూ వుండగా...

“దమయంతి మేడంకి ఇప్పటివరకు మీరు డబ్బు దండిగా ఇచ్చే ఉంటారుగా... అది తీసుకుని మాకు ఇవ్వండి! తర్వాత సంపాదించి ఆవిడకు ఇచ్చేయండి. దట్సాల్! ” అని ఫ్రీ అడ్వైజ్ ఇచ్చారు.

కోటిలింగం ఏదో చెప్పబోతుంటే...

“సార్! ఈ వీడియో మీ భార్యా చూస్తే మీకు జరిగే విపత్తు కంటే... మీరు మాకు ఇచ్చే అమౌంట్ చాలా చిన్నది. ఆలోచించుకోండి!” అన్నారు తిన్న చేతులు కడుక్కుంటూ.

✦✦✦

దమయంతి ఇంటికి వచ్చాడు కోటిలింగం... బాగా టెన్షన్ గా వున్నాడు.

“ఎవరు వాళ్ళు?... ఆ వీడియో ఎవరు తీశారు?” అని అడిగింది దమయంతి.

“అది తర్వాత ఆలోచిద్దాం గానీ, నేనిచ్చిన కోటి రూపాయల్లో ఓ యాభై లక్షలు అర్జంట్‌గా తీసుకురా!” అన్నాడు కోటిలింగం నుదిటికి పట్టిన చెమట తుడుచుకుంటూ.

"అది కాదండి... ఇప్పుడు ఇస్తాము సరే... తర్వాత కూడా ఇలాగే బెదిరించి మళ్ళీ డబ్బు కావాలంటే ఏం చేస్తావ్?..." అని లాజిక్ పాయింట్ లేవనెత్తింది దమయంతి.

"దామూ... దాని గురించి డిస్కస్ చేసే టైం లేదు ఇప్పుడు... నేను డబ్బు ఇవ్వడం ఆలస్యం చేస్తే ఆ వెధవలు ఆ వీడియో తీసుకెళ్ళి...మా ఆవిడకు చూపిస్తారు. మా ఆవిడ సంగతి నీకు తెలీదు! నేను ఇలాంటివాడ్ని అని తెలిస్తే... నిన్నూ నన్నూ చంపీ... తనూ చచ్చే రకం!" అని తన భార్య మీద తనకున్న భయాన్ని వెల్లగక్కాడు కోటిలింగం.

ఇక కోటిలింగంతో వాదించి లాభం లేదను కుని దమయంతి డబ్బు తీసుకుని రావడానికి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది.

✦✦✦


టాటా, బిర్లాలు చెప్పిన చోటికి వెళ్లి... ఆ డబ్బు ఇచ్చి– "ఇదిగో! ఇప్పుడే చెబుతున్నా!... ఈ వీడియోని అడ్డుపెట్టుకుని మళ్ళీ నా దగ్గర డబ్బు లాగాలని చూస్తే... మిమ్మల్ని ప్రాణాలతో ఉండనివ్వను!" వార్నింగిచ్చాడు కోటిలింగం.

అందుకు వాళ్ళు– "ఓకే డన్!" అన్నారు.

✦✦✦

ఎప్పటిలాగే ఇంటికి ఆలస్యంగా వచ్చాడు కోటిలింగం.

జరిగిన ఇన్సిడెంట్ తెలీని కాంచనమాల కేజువల్‌గా వుంది. కోటిలింగం కూడా ఏమీ జరగనట్టే బిహేవ్ చేస్తున్నాడు. ఏదో కాస్త తిని




పడుకున్నాడు. పడుకున్నాడే గానీ కళ్ళు మూసు కుని భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ వున్నాడు... ఒకవేళ దమయంతి సంగతి తన భార్యకు తెలిస్తే ఏం చేయాలి? తెలియకుండా ఉండా లంటే ఎలాంటి కార్యాచరణ చేపట్టాలి అని.

పొద్దున్నే లేచి టిఫిన్ తిన్నాక ఆఫీస్‌కు వెళ్లి పోయాడు కోటిలింగం.

ఆ తర్వాత కోటిలింగం ఇంటికి టాటా, బిర్లా వచ్చారు. వాళ్ళు తెచ్చిన యాభైలక్షల్లో ముప్పైలక్షలు కాంచనమాల తీసుకుని వాళ్ళకు చెరో పది లక్షలు ఇచ్చి పంపేసింది.

సిచ్యుయేషన్ ఏంటో మీకు అర్థమవలేదు కదా?... అలా ఐతే ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్దాం.

✦✦✦

వారం క్రితం కాంచనమాల దగ్గరకు తన తమ్ముడు వచ్చి– "అక్కా! కోటిలింగం బావకు ఎవరో దమయంతి అనే ఆవిడతో ఎఫైర్ వుంది. ఇదిగో ఆ వీడియో." అని చూపెట్టీ... "సాయంత్రం ఇంటికి రాగానే మళ్ళీ లైఫ్‌లో దాని మొహం కూడా చూడకుండా బావను బాగా దులిపేయ్!" అని ఆవేశంతో కూడిన సలహా ఇచ్చాడు.

కోటిలింగం ఇలాంటి వాడని తెలిసి షాక్ అయింది కాంచనమాల.

సావధానంగా అలోచించింది.


ఆ తర్వాత కాంచనమాల తనకు తెల్సిన టాటా, బిర్లా అనే కుర్రాళ్ళతో మాట్లాడి ఏం చేయాలో వాళ్ళకు చెప్పి, వాళ్ళకు చెరో పది లక్షలు ఇస్తానంది.

అందుకు వాళ్ళు సరే అన్నారు.

✦✦✦

ఆ టాటా బిర్లా లాగే ఇంకొకళ్ళు మళ్ళీ ఆ వీడియో చూపించి కోటిలింగాన్ని బ్లాక్ మెయిల్ చేస్తారని భవిష్యత్తుని అంచనా వేసింది దమయంతి. అలా జరిగితే కోటిలింగం మళ్ళీ తన దగ్గర వున్న డబ్బుని వాళ్ళకు ఇవ్వడానికి అడుగుతాడని పసి గట్టింది. దాంతో కోటి లింగంకు చెప్పకుండా దమయంతి ఆ డబ్బుతో ఊరొదిలి పరార్ అయిపోయింది.

కోటిలింగం మొదట బాధ పడ్డా ఇక నుండి కాంచనమాలకు భయపడకుండా వుండొచ్చని తనని తానూ సమర్ధించుకున్నాడు.






మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని
పరిచయం చేస్తున్న శీర్షిక! 8

## గోపాలకృష్ణ

గోపాలకృష్ణ పేరుతో కార్టూన్లు వేసే వీరి పూర్తి పేరు...వేంద్ర గోపాలకృష్ణ. పుట్టింది పెనుగొండ (ప.గో. జిల్లా) తల్లిదండ్రులు... వేంద్ర వెంకన్న, శ్రీమతి మంగమ్మ. భార్య పేరు బాలస్వప్న....ఒక కుమార్తె స్వాతి తేజస్వి.

1982లో మొదటిసారి రెండు కార్టూన్లు ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురింపబడ్డాయి.

కార్టూనిస్టుగా ఇంతవరకు 15000 కు పైగా కార్టూన్లు వేసారు.

వీరి కార్టూన్లు అన్ని దిన, వార, పక్ష, మాస (తెలుగు) పత్రికలలో.... కన్నడ మళయాళం, తమిళ పత్రికలలోను, కార్టూన్ వాచ్ పత్రికలోను ప్రచురింపబడ్డాయి.

రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి, అంతర్జాతీయ, కార్టూన్ల పోటీల్లో ఎన్నో బహుమమతులు గెలుచుకున్నారు.

హైద్రాబాద్ ఏనిమేషన్ రంగంలో ఈటీవీలో, రామోజీ ఫౌండేషన్ సంస్థల్లో యానిమేటర్‌గా, ఆర్టిస్ట్‌గా పనిచేసారు.

సాంగులే బంగారు రాజా, స్మైల్‌ప్లీజ్, శీర్షికలతో చాలా కార్టూన్లు వేసారు. హాస్యానందంలో 'నవ్వే ఆనందం' శీర్షికన కార్టూన్లు గీస్తున్నారు. చాలా కామిక్ స్టోరీస్ ప్రచురింపబడ్డాయి.

'నా అభిమాన ఆర్టిస్ట్ శ్రీచంద్రగారి ఇలస్ట్రేషన్స్, కార్టూన్స్ నా లైన్స్‌లో చాలా ప్రభావం చూపించాయి.' అంటారు గోపాలకృష్ణగారు.


ఎన్నో పత్రికలకు, పుస్తకాలకు బొమ్మలు, కవర్‌పేజీలు, కంపెనీ లోగోలు, కారికేచర్స్ కామిక్ పుస్తకాలకు బొమ్మలు వేసారు.

శ్రీజయదేవ్‌గారి జయదేవ్ రాజలక్ష్మీ కార్టూన్ అకాడమీలో ప్రథమంగా వీరి కార్టూన్ల సంకలనం 'గోపాలకృష్ణ కార్టూన్స్' బుక్ వెలువడింది.


కార్టూన్‌ని కార్టూన్‌లాగే గీయడానికి ప్రాధాన్యత ఇచ్చే గోపాలకృష్ణగారికి కేప్షన్ లేని కార్టూన్‌లంటే చాలా యిష్టం.


2024 సంవత్సరానికిగాను బాపురమణ పురస్కారం అందుకున్నారు.


గోపాలకృష్ణగారు మరిన్ని జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకోవాలని హాస్యానందం మనసారా కోరుకుంటోంది.














నేనలా ఎత్తుకోలేనే ...... ఇలాగైతే ఓకే!





ప్రీ వెడ్డింగ్ షూట్ తో గొడవ పడ్డారట_




మన టైగరన్న న్యూఇయర్ పార్టీకి వస్తాడట -
వైఫ్ తో చెప్పొస్తానని ఇంట్లోకెళ్లాడు - ఒరా _
పార్టీకెళ్లడానికి ఒప్పుకో... డార్లింగ్... ప్లీజ్


START


DUST BIN
DUST BIN





# 4 + 4 = 2 !

దినవహి సత్యవతి
9790752180

**'ధడ్... ధడ్...ధడ్...ఠాంగ్...ఠంగ్...' వంటిట్లోంచి వస్తున్న శబ్దాలకి ఉలిక్కిపడి లేచాడు గుర్నాథం.**

**'అమ్మో ఇదేమిటీ ఇవాళ ప్రొద్దున్నే మొదలుపెట్టింది పంకు! ఏమైందో ఏమిటో'... మంచం దిగి... భయపడుతూ భయపడుతూ మెల్లిగా పిల్లిలా నడుచుకుంటూ వెళ్ళి వంటగదిలోకి తొంగి చూసాడు.**

చిర్రుబుర్రులాడిపోతూ గిన్నెలు బంతుల్లా విసిరేస్తున్న పంకజాన్ని చూసి–

'అమ్మో! ఇదేదో నా ప్రాణం మీదకి వచ్చేలా ఉంది ఇవాళ! ఏడుకొండలవాడా నువ్వే దిక్కు' మనసులోనే దణ్ణం పెట్టుకుని ముఖం కడుక్కుని వచ్చాడు.

కడుపులో కాఫీ ఆకలి నకనకలాడుతున్నా అడిగే ధైర్యం చెయ్యలేక... హాల్లోనే సోఫాలో ఒదిగి కూర్చుండిపోయాడు.

ఐదు నిమిషాల తర్వాత... చేతిలో కాఫీ గ్లాసుతో వచ్చి... తెచ్చి... 'ధడేల్' శబ్దంతో గుర్నాథం ఎదురుగా టీపాయ్ మీద పెట్టింది పంకజం.

"థ్యాంక్స్ పంకూ!" లటుక్కున కాఫీ గ్లాసు చేతిలోకి తీసుకుని పెదాలకి ఆనించుకోబోయాడు.

"ఆ...ఆ... దీనికేం తక్కువలేదు!"

"అది కాదే పంకూ..."

"పంకూ ఏమిటి పంకూ గొంకూనూ!... ఇంకేం దొరకలా...ఇంచక్కా పంకజం అని పిలవచ్చుగా!" మాటల బాణం విసిరింది.

"అది నీకు నేను పెట్టుకున్న ముద్దు పేరే!" గోముగా అన్నాడు.

"అబ్బో!... ముద్దు ఇప్పుడదొక్కటే తక్కువైందనీ..." మూతి మూడు వంకర్లు తిప్పింది.

'ఎప్పుడూ మీరు పంకూ... అని పిలిస్తే నాకెంతో బాగుంటుందండీ అనే పంకజమేనా ఇది' అనుకుని... ఇచ్చిన కాఫీ మళ్ళీ ఎక్కడ లాగేసుకుంటుందోనని ఒక్క గుక్కలో త్రాగేసి–

"అసలేమైందే పంకజం!..." లాలనగా అడిగాడు.

"ఇంకా ఏం కావాలి నా బ్రతుక్కి!... ఒక ముద్దూ ముచ్చటా లేదు... ఎంతసేపూ వంటిల్లూ,అదిగో మీ కొడుకు ఆలనాపాలనా!" విసుక్కుంది.

"ఇప్పుడు నీకేం తక్కువైందే... పనిమనుషుల్ని పెట్టుకోమంటే... నాపని నేను చేసుకుంటేనే నాకు తృప్తి అని వద్దన్నావు. ఒకటి కాదు రెండు కార్లున్నాయి మనకి... నీకు డ్రైవింగూ వచ్చు!... హాయిగా ఇష్టమొచ్చిన చోటుకి వెళ్ళవే అంటే... ఒక్కర్తినీ వెళ్ళను అంటావు. నాకేమో చిన్న వ్యాపారం. వదిలి రాలేను!"

"ఆ ఉన్నాయిలే పెద్ద గొప్ప ముష్టి కార్లు! పేరుకే! ఎప్పుడు ఎక్కడికి వెళదామన్నా అనవసరంగా ఆయిల్ ఖర్చనీ... అదనీ ఇదనీ... ఏదో ఒక సాకు చెప్తావు. పైగా అవేమో డీజిల్ కార్లు. డీజిల్ ధర చూస్తే చుక్కలు చేరి దిగి రానని మొండికేసేటప్పటికి అందుకోలేక ఇప్పుడు ఎవ్వడూ వాటిని వాడడమే లేదు... అందరికీ ఇప్పుడు కరెంటు కార్ల మోజు, నాకేమో అదంటేనే భయం. పోనీలే ఎంత డబ్బైనా పోసి ఒక లీటర్ కొని దాని మొహాన పోద్దామన్నా అసలు దొరకడమే లేదు. ఇంక ఎందుకూ ఆ కార్లు ఇంట్లో దిష్టి బొమ్మల్లాగా! తీసుకెళ్ళి చెత్త సామాను కొట్లో అమ్మేయ్!" పంకజం కోపం తారస్థాయికి చేరుతోంది.

"అయితే ఇప్పుడేం చేయమంటావే?"

"ఎప్పుడైనా మన పక్కింటి మీనాక్షిని చూసావా?"


"అమ్మో! నాకంత ధైర్యమే!! నిన్నేన్ దప్పన్యులనెరంగనే భామా!" రాగం అందుకున్నాడు.

"పాడింది చాలుగానీ ఆపు! లేకపోతే వీధిలో గాడిదలు ఇంట్లోకి రాగలవు!" గదిమింది.

పంకజం మాటలకి ముఖం చిన్నబుచ్చుకున్నాడు గుర్నాథం.

"అయినా... నువ్వుండగా పక్కింటావిడని నేనెందుకు చూస్తానే?"ముసిముసిగా నవ్వాడు.

"చాల్లే సంబడం! వెధవ జోకులాపు. అదిగో



ఒక్కసారి అటు చూడు!" పంకజం చూపిన వైపు దృష్టి సారించాడు.

అక్కడ పక్కింటి రమణ సైకిలు శుభ్రం చేస్తూ పెళ్ళాంతోనూ, ఒక్కగానొక్క పిల్లతోనూ ఎంచక్కా కబుర్లు చెప్తున్నాడు!

రమణ ప్రభుత్వోద్యోగి. అకౌంట్ సెక్షన్‌లో గుమాస్తా... అతని భార్య మీనాక్షి, కూతురు పల్లవితో ఈ మధ్యనే మా పక్కింట్లో అద్దెకు దిగాడు.


"చూసానూ! అయితే ఏంటిట?"

"చూడ ముచ్చటైన సంసారం. ఎంచక్కా రోజూ ఉదయాన్నే భార్యనీ కూతుర్నీ అదిగో అలా సైకిల్ పైన ఎక్కించుకుని సరదాగా ఊరంతా తిరిగి వస్తాడు!"

"అవును మరీ ఎందుకు తిరగడూ ప్రభుత్వ కార్యాలయంలో పని. ఎప్పుడు వెళ్ళినా అదేమని అడిగేవాళ్ళు కానీ, పని చేసినా చేయకపోయినా గదిమే వాళ్ళు గానీ ఉండరుగా మరి. అందుకే అంత తీరిక. ఇంట్లో ముచ్చట్లన్నీ తీరాక వెళ్ళాలనిపిస్తే వెళతాడు!" అక్కసు వెళ్ళగక్కాడు గుర్నాథం.

"అదంతా నాకు అనవసరం. నువ్వేం చేస్తావో నాకు తెలియదు. నాకూ అలా తిరగాలని ఉంది!!"

"ఏంటి!!! ఆ రమణతోనా?! అవ్వ ఎవరైనా వింటే నవ్విపోతారే" ముక్కున వేలేసుకున్నాడు.



"అబ్బ! ఒకటే కంపు. ఇక ఆపుతావా నీ కుళ్ళు జోకులు. నవ్వే వాళ్ళేవరూ లేరిక్కడ!" ముక్కు మూసుకుంటూ వెటకరించింది.

"ఇంతకీ ఏమిటే నీగోల?" విసుక్కున్నాడు.

"నువ్వు కూడా ఎంచక్కా ఒక సైకిల్ కొని... నన్నూ బాబునీ అలా సరదాగా తిప్పచ్చుగా!?"

"అమ్మో! సైకిలా?" భయంతో కళ్ళు వెడల్పవగా గుండెల మీద చెయ్యి వేసుకున్నాడు గుర్నాథం.

"ఆc!... అవును సైకిలే!!"

"ఇప్పుడు సైకిల్ కొనమంటే ఎలాగే దాని ఖరీదు ఎంతో అసలు నీకేమైనా తెలుసా?"

"ఎంతైతే నాకేమి?... ఆ గుమాస్తా కొనగా లేనిది నువ్వు కొనలేవా?"

"అతనికి మామగారు కారు కొనిస్తానంటే వద్దుగాక వద్దని అలక పాన్పు ఎక్కాడట... అసలు నీకేం కావాలయ్యా బాబూ అంటే పెద్దగా కోరికలేమీ లేవండీ జస్ట్ ఒక్క సైకిల్ కొనివ్వండి చాలు అన్నాడట!"

"తెలివిగలవాడు. దూరమాలోచించాడు." నువ్వూ ఉన్నావు ఎందుకూ అన్నట్లు గుర్నాథం వైపు ఓ వాడి చూపు విసిరింది పంకజం.

"అప్పటికే డీజిల్ ధర పెరిగీ... దొరక్క జనాలు గిజగిజలాడుతుంటే, మొత్తుకున్నా వినకుండా, మీ నాన్నేమో అతి తెలివిగా, చవక లో పోతుందని, రెండు డీజిల్ కార్లు కొని నా మొహాన పడేసి గొప్పలు కొట్టుకున్నాడు!"


"ఇదిగో మా నాన్న జోలికి వెళ్ళావంటే చూడు..." తర్జని చూపిస్తూ హెచ్చరించింది.

"హూ!... నా బ్రతుక్కి అంత ధైర్యం కూడానూ" గొణుక్కున్నాడు.

"ఏంటీ ఏదో అంటున్నావు?" ఉరిమింది.

"ఆ...అబ్బే ఏం లేదే... ఏం లేదే..." తత్తర పడ్డాడు.

"అసలు విషయానికొద్దాం. విను! ఏం చేస్తావో ఎలా కొంటావో నాకు తెలియదు... నువ్వు వెంటనే సైకిల్ కొనాలి. అలాగని ఓ చవకబారు సైకిల్ కొని నా ముఖన పడేస్తే ఊరుకోను. మంచి అల్ట్రా మోడర్న్ సైకిల్ కొనాల్సిందే, మమ్మల్ని ఎక్కించుకుని తిప్పాల్సిందే." పక్కనే ఉన్న చెక్క బల్ల బర్రుమని లాగి దానిని గుద్ది మరీ చెప్పింది.




"ఇప్పుడు సైకిల్ కొనాలంటే... నా తల తాకట్టు పెట్టాల్సిందేనే..." తలపట్టుకున్నాడు.

"అయితే పెట్టు! ఎలాగూ మట్టి బుర్రే! ఎక్కడున్నా ఒక్కటే. నీకు కేవలం పది రోజులు టైం ఇస్తున్నాను. సైకిల్ కొన్నావా సరే సరి లేదంటే నేను మా పుట్టింటికి వెళ్ళిపోతాను!" అల్టిమేటం జారీ చేసి రుసరుసలాడుతూ నిష్క్రమించింది.


'దేవుడా' అనుకుంటూ గోడకి తగిలించి ఉన్న తెలుగు క్యాలండర్ చూసాడు.

2050వ సంవత్సరం డిసెంబరు నెల! ఆ రోజు తేదీ చూసాడు... ఇక పది రోజుల్లోనా అమ్మో అంత తక్కువ సమయంలోనా! ప్రస్తుత కాలంలో సైకిల్ కొనడమంటే మాటలా! అది ఏ బింబానీ, తీటాలాంటి వాళ్ళకే సాధ్యం కానీ నాలాంటి సామాన్యుడు కొనగలిగేలా ఉందా సైకిలు? రమణ అదృష్టవంతుడు... నాడు పెళ్ళిలో దొరికిన అవకాశాన్ని బాగా ఉపయోగించుకుని చక్కని సైకిల్ కొట్టేసాడు మామ దగ్గరనుంచి... ఇప్పటికిప్పుడు ఎక్కడనుంచి తేవాలి అంత డబ్బు? తన కోరిక తీర్చకపోతే బిడ్డని తీసుకుని పుట్టింటికి పోతానంటోందే పంకజం. ఇప్పుడు అతి మామూలు సైకిలు కూడా లక్షలు ఖరీదు చేస్తోందే! ఇదేమో అల్ట్రా మోడర్న్ సైకిల్ అంటోందే! హతవిధీ!... ఎలాంటి గడ్డు సమస్య తెచ్చావయ్యా?" తల పట్టుకున్నాడు గుర్నాథం!

ఏం చేయాలాని జుట్టు పీక్కోవడం మొదలు పెట్టగానే చటుక్కున ఒక ఐడియా తట్టింది!

అంతే! ఉత్సాహంతో గెంతులేసి... జుట్టు మళ్ళీ చక్కగా సర్దేసుకుని, వెంటనే తన ఆలోచన అమలు చేసాడు గుర్నాథం!

ఇంతకీ అదేమిటంటే... తెల్ల ఏనుగుల మాదిరి పోషించడానికి భారంగా తయారైన, రెండు నాలుగు చక్రాల వాహనాలను అయిన కాడికి అమ్మేసి... ఒక అందమైన ఆధునిక ద్విచక్ర వాహనం కొని... ముద్దుల భార్య పంకజం ముచ్చట తీర్చాడు గుర్నాథం!





# ఉరి తాడుతో ఉయ్యాల

గంగాధర్ వడ్లమన్నాటి,
9908445969

**డబ్బు బ్యాగ్ అందిస్తూ – “ఒరే ఓబులూ! ఈ డబ్బు సంచి నీ దగ్గర ఉంచు... ఈ కారుతో పాటు నువ్వు కారంచేడెళ్ళిపో! నేను దిగిపోయి, ఏ లారీయో ఆపి, ఎక్కేసి పట్నం వెళ్ళిపోతాను... అక్కడ గవర్నమెంట్ హాస్పిటల్‌లో జాయిన్ అయి పోతాను. నేను డిశ్చార్జ్ అయ్యాక, మనం మళ్ళీ ఈ గులమాడు గ్రామంలో జరిగే తిరునాళ్ళరోజు కలుద్దాం! సరేనా! ” అన్నాడు తన కాలిని బాధగా పట్టుకుంటూ.**

“తిరునాళ్ళరోజు ఎందుకు?...” అడిగాడు ఓబులు అయోయంగా.

“ఆ!తాటితాండ్ర కొనుక్కు తినడానికి!” చెప్పాడు జగ్గా పళ్ళు కొరుకుతూ.

నాలుకని చప్...చప్‌మని చప్పరిస్తూ...

“అలాగా! మరి చెప్పవేం... ఆ తాటి తాండ్రంటే నాకు భలే ఇష్టం! మా మామ్మ నా చిన్నప్పుడు ఆ తాండ్రపొరలు తీసి, నన్ను నోరు తెరవమని...” ఓబులు ఇంకేదో చెప్పేంతలో–


“నోర్ముయ్! మనం తిరునాళ్ళలో కలిసేది, డబ్బు పంచుకోవడానికి. తాండ్రా, జీళ్ళు, కొనుక్కు తిండానికి కాదు. అప్పటి దాక ఈ డబ్బు నీ దగ్గరే ఉంచు!” విసుగుతో విసురుగా చెప్పాడు జగ్గా.

ఆ మాటకి ఓబులు, కారం మింగినట్టు వికారంగా చూస్తూ–

“జగ్గా!... నువ్ నా గురించి ఏవనుకుంటున్నావ్?” అని ఆ బ్యాగ్‌ని పక్కకి తోసేస్తూ...

“ఆ ఇంటి గోడ దూకినప్పుడు, నీ కాలుకి రాయి గుచ్చుకుని... చాలా రక్తం పోయింది. పైగా ఇప్పుడు సరిగా నడవలేక పోతున్నావ్ కూడా. ఇలాంటి పరిస్థితుల్లో నిన్ను వదిలి, ఈ డబ్బుతో నా దారిన నేను వెళ్ళలేను. ఈ గ్రామానికి ఇద్దరం కలిసే వచ్చాం! ఇద్దరం కలిసే ఆ ఇంట్లో దొంగతనం చేశాం! అలాగే ఇద్దరం కలిసే ఆసుపత్రికి వెళ్దాం! అంతే!!” అన్నాడు కారు స్పీడు పెంచుతూ.


“ఒరే ఓబులూ! నీకు దండం పెడతాన్రా నాయనా!... ఇలాంటి వాటిలో జాలి గుండె



చూపితే... నీ తుపాకిగుండు కూడా నిన్ను కాపాడలేదు. కనుక నా మీద జాలిని గాలికి వదిలి... నీ అతి పోకడలకి హారతిచ్చేయ్... లేదంటే ఆనక మనిద్దరం, ఒకరికొకరం జైలు గోడల మధ్య గోడు వెళ్లబోసుకుంటూ మగ్గి పోవాల్సిరావచ్చు. అదే జరిగితే... అలా మగ్గి పోయి మగ్గిపోయి, చివరికి విడుదలయ్యాక స్విగ్గీబాయ్స్‌గా చేరి కష్టపడి బతకాలి. ఎందు కంటే, దొంగలుగా మన భవిష్యత్తు మొత్తం ఆ జైల్లోనే బుగ్గిపాలయిపోద్ది కాబట్టి... కనుక నా మాటలు నీ డొప్ప చెవుల్తో శ్రద్ధగా విను! ఇంత మారుమూల గ్రామంలో కరెంటే సరిగా లేదు. ఇక ఇక్కడ ఆసుపత్రి ఎక్కడ ఉంటుంది చెప్పు?... ఉన్నా అది మనకి కనబడుతుందా పాడా! కనుక నన్ను టెన్షన్ పెట్టక, ఈ ఊరు దాటాక ఏదైనా జంక్షన్ చూసి దించేయి... ఇందాక చెప్పినట్టు ఏ లారో, కారో పట్టుకు పోతాను!..." చెప్పాడు అరికాలికి కర్చీఫ్ చుట్టు కుంటూ.

"నువ్ ఎంత చెప్పినా, ఏం చెప్పినా నేను వినను గాక వినను. నువ్ మరీ అపశకునంగా ఆలోచిస్తున్నావ్. అయినా చిన్నదో పెద్దదో ఆసు పత్రి ఎక్కడో ఒక చోట ఉండనే ఉంటుంది. సమయం కూడా పెద్ద కాలేదు. ఏడవుతోంది. ఇది మరీ విసిరేసినట్టున్న పల్లెటూరు కావ డంతో, ఇలా చిమ్మచీకటితో అర్ధరాత్రిలా అని పిస్తోంది!" అంటూనే క్షణం ఆగి...

ఒక్కసారిగా... "రేయ్ జగ్గా! అటు చూడు!"




అంటూ గట్టిగా అరిచాడు ఓబులు.

ఆ అరుపుకి తుళ్ళిపడిన జగ్గా... కంగారు పడుతూ...

"ఏమైందిరా నాయనా! పోలీసులా?" అడి గాడు బిక్కమొహంతో... అటూ ఇటూ భయం తో బెదురు చూపులు చూస్తూ.

"కాదురా జగ్గా! ఏదో ప్రైవేటు ఆసుపత్రి బోర్డు! ఓసారి అటువైపు చూడు. పద! నీ గాయానికి ఆ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ తీసు కుని వెళ్లిపోదాం! వాళ్ళు అడిగిన దానికంటే ఎక్కువ పడేస్తే... వాళ్ళే పడి, పడీ మరీ ట్రీట్ మెంట్ చేస్తారు!" అన్నాడు కారుని అటు వైపు తిప్పుతూ.

"వద్దురా ఓబులూ! మనసెందుకో గుబులుగా ఉంది. నా మాట విను. దొంగతనం చేసిన ఊళ్ళో ఎక్కువ సేపు ఉండటం మంచిది కాదు... నాకెందుకో ఇప్పుడు నా గాయానికి వైద్యం చేయించడం మంచిది కాదనిపిస్తోంది. పైగా నా ఎడం కన్ను వైబ్రేషన్లో పెట్టినట్టు తెగ కొట్టుకుంటోంది... కనుక నా కాలి కోసం కారు ఆపకు... నా కాలు పోతే పోనీ కానీ, కారు మాత్రం ముందుకు పోనీరా నాయనా! నీ కాళ్ళకి దణ్ణం పెడతాను!..." భయం భయంగా చూస్తూ అన్నాడు జగ్గా.

"ఇంకేం చెప్పకు! వెతకబోయిన తీగ కాలి వేలికి తగిలినట్టు...
ఇక్కడ ఈ ఆసుపత్రి కనిపించింది. వెళ్ళి వచ్చేద్దాం పద!...."
అంటూ కార్ అటు వైపుకి తిప్పేసి సరిగ్గా ఆసుపత్రి ముందు ఆపాడు.

కార్ దిగి... జగ్గాని నెమ్మదిగా కారు దించి–

"పద!" అంటూ జగ్గాతో పాటు ఆ ఆసుపత్రిలోకి అడుగుపెట్టాడు.
తెల్లకోటులో ఓ డాక్టరమ్మ కనబడగానే... "హమ్మయ్యా!" అని ఉత్సాహంగా ఆమె వైపుగా నడిచేసి...

"డాక్టర్! ముందుగా మావాడి కాలికి ట్రీట్‌మెంట్ చేయండి! ఈ అడవిలో వస్తుంటే సూదిగా ఉన్న పెద్ద రాయి గుచ్చుకు పోయి చాలా రక్తం పోయింది. మావాడు ఫుల్లుగా తాగినప్పుడు కూడా తూలకుండా నడిచేవాడు.



అలాంటిదిపుడు అడుగులో అడుగు కూడా సరిగా వేయలేక పోతున్నాడు. ముందు అవసరమైన ట్రీట్‌మెంట్ చేస్తే, ఆనక మేం పట్నం వెళ్ళి మిగతా ట్రీట్‌మెంట్ తీసుకుంటాం!" చెప్పాడు ఓబులు

"మిస్టర్! ఏం మాట్లాడుతున్నావ్?... నేను ట్రీట్‌మెంట్ చేయలేను! ఎందుకంటే..." అని ఆమె మాట పూర్తి చేయక ముందే... "డాక్టర్! మర్యాదగా ట్రీట్‌మెంట్ చేయండి...లేకపోతే మిమ్మల్ని కాల్చి చంపేస్తాను!" అంటూ జేబులోంచి తుపాకి తీసి ఒక రౌండ్ పైకి కాల్చాడు.

ఊహించని ఆ పరిణామానికి ఆమె ఒక్కసారే బిక్కచచ్చి పోయింది. భయం భయంగా వాళ్ళిద్దరి వంకా చూస్తూ...

"సార్! మీరు పొరబడుతున్నారు... నేను ఇతనికి వైద్యం చేయలేను. కావాలంటే మీకు డబ్బులు ఇస్తాను... వేరే ఎక్కడైనా మంచి హాస్పిటల్‌లో ఇతనికి వైద్యం చేయించండి!" చెప్పింది గజ గజా వణికి పోతూ!

"ఛీ! డబ్బు కోసం చేయి చాచేవాడిలా కన్పిస్తున్నానా?"

"పోనీ ఫోన్ పే చేయనా?" అడిగింది అమాయకంగా.

"నీ మొహం సంతకెళ్ళా... వద్దు! ఫోన్‌పే అక్కరలేదు!" చెప్పాడు ఓబులు ఆమెని నెత్తిమీద మొట్టేయబోతూ ఆగి.


"పోనీ గూగుల్ పే చేయనా?" అడిగింది ఇంకా భయంగా.


"ఇదిగో!... నా పేషెన్స్ తగ్గించావంటే, నా చేతిలో పేషెంట్ అయిపోగలవ్!... నీకు ఎంతకావాలో అంత నేనే పేటీయం చేస్తాను... ముందు వైద్యం చేయి!" అన్నాడు మరింత కోపంగా.

ఇంతలో జగ్గా... ఓబులు జబ్బ పట్టుకు పక్కకు లాగి...


"ఒరేయ్ నాయనా! రా రా!... పోదాం! ఆవిడతో మన కెందుకొచ్చిన గొడవ చెప్పు!" అంటూ అతని చేయి పట్టుకున్నాడు.

అయినా ఓబులు వినకుండా– "డాక్టర్‌వి అయ్యుండి వైద్యం చేయనంటావా?... సిగ్గులేదూ?" అన్నాడు తుపాకి గురిపెడుతూ.




"సిగ్గుంది... కానీ డాక్టర్ డిగ్రీ లేదు. మీరనుకుంటున్నట్టు నేను నిజమైన డాక్టర్‌ని కాను... యాక్టర్‌ని... ఇది కూడా నిజమైన ఆసుపత్రి కాదు. ఇదొక సినిమా సెట్. ఇప్పుడే షూటింగ్ అయిపోయింది. పెద్ద యాక్టర్లందరూ ఇక్కడికి దగ్గరలో ఉన్న తోటబంగ్లాకి వెళ్ళిపోయారు... జూనియర్ ఆర్టిస్ట్స్‌ని మాత్రం ఇక్కడ ఉండమన్నారు. నేను కూడా ఈ సినిమాలో చిన్న పాత్ర చేస్తున్నాను. నిజం!...అమ్మతోడు సార్!!..." చెప్పింది, నెత్తిన చెయ్యి, కళ్లలో నీళ్ళు పెట్టుకుంటూ.




ఇంతలో అక్కడి హడావుడి చప్పుడుకి... మిగతా గదుల్లో ఉన్న ఓ నలభైమంది జూనియర్ ఆర్టిస్టులు, కర్రలు, కట్టెలూ పట్టుకుని అక్కడికి వచ్చారు.

వారందరినీ చూసిన ఓబులు, జగ్గాలకి మతి పోయినంత పనైంది.

"ఇప్పటివరకూ, ఎన్నో ఎరలు వేసినా... పోలీసులకే మనం చిక్క లేదు. కానీ ఈ రోజు నీ వల్ల, ఏ ఎర లేకుండా, ఊరికే వచ్చి ఇరుక్కు పోయాం. నీలాంటోడే వెనకటికి, ఉయ్యాలూ పుతానని తీసుకెళ్ళి... మెడకి ఉరితాడు తగిలించాడట!" ఎర్రగా ఓబులు వైపు చూస్తూ అన్నాడు జగ్గా.



# రాంబాబు-ది హీరో

వీరేశ్వర రావు మూల
9494746228

**రాంబాబు గోదావరి జిల్లా లో పుట్టాడు. తండ్రి వంద ఎకరాల ఆసామి. రాంబాబు ఇంటర్ పాసవగానే నేను సినిమా హీరోనవుతానని, పైచదువులు చదవనని భీష్మించు కున్నాడు. తండ్రి– ఈ గోల ఏమిటిరా, మన ఇంట వంట లేదని చెప్పినా వినలేదు. పాన్ఇండియా హీరోనవుతానని అన్నాడు. తేడా వస్తే పాన్‌లు చుట్టుకుంటూ బతకాలి అని తండ్రీ హెచ్చరించాడు. రాంబాబు వినలేదు.**

**తన సిక్స్‌ప్యాక్ బిల్డింగ్‌కి ఐదు ఎకరాలు కరిగించాడు.**

✦✦✦

రైజింగ్‌స్టార్ రాంబాబు నటించే... 'నీ యంకమ్మ' సినిమా టాగ్‌లైన్ ఇది పక్కా మాస్ గురూ అని తగలించి పూజా కార్యక్రమాలు మొదలు పెట్టాడు రాంబాబు.

రాంబాబు తండ్రి, మేనమామ నిర్మాతలుగా వ్యవహరించారు. సంగీతం వమన్ సమ కూర్చాడు. వమన్ అంటే తమిళియన్ కాదు. మన తెలుగు వామనరావే. అలా పేరు మార్చు కున్నాడు. షూటింగ్ మొదలయ్యింది.

చెరువు లో సాంగ్ షూట్ చేస్తున్నారు.

అదే సాంగ్ చూడడానికి ఒక పాము వచ్చింది. బాబోయ్ పాము అని లావు హీరో యిన్ రాంబాబుని బల్లి గోడను అతుక్కున్నట్టు అతుక్కుంది.

ఆ హీరోయిన్‌తో గట్టు ఎక్కేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది.

✦✦✦

తరువాత హీరోయిన్ చిన్న డైలాగ్‌కి టేక్‌లు కేక్‌ల్లా తినేస్తోంది.

డైరక్టర్ గిరి కలగచేసుకున్నాడు.

"ఏమిటీ?"

"నా సర్వస్వం నీదే... డైలాగ్ చెప్పాలి... చెప్పలేక పోతోంది కన్నడ భామ!" అన్నాడు అసిస్టెంట్.

"నేనే పలక లేక పోతున్నా... ఆ పిల్ల ఏం చెబుతుంది?" అన్నాడు గిరి.

కెమెరా పైనుండి కిందకి తియ్యి.

"చెప్పమ్మా! నాది నీదే!" అని డైరక్ట్ చేసాడు గిరి.

షాట్ ఓకే అయ్యేసరికి అసిస్టెంట్‌కి స్పృహ తప్పింది.

✦✦✦

"నేను పెట్టింది పొలికేకరో, పొలిమేర దాటింది రో..." అనే సాంగ్ టీజర్‌గా రిలీజ్ చేసాడు రాంబాబు.

యూ ట్యూబ్‌లో లక్ష వ్యూస్ గ్యారంటీ అన్నాడు వమన్. యూట్యూబ్‌లో వందమంది చూసారు సాంగ్‌ని. అందులో 90మంది కన బడితే చావు కేక పెట్టిస్తాం అని కామెంట్ ఇన్‌బాక్స్‌లో పెట్టారు.

కథ ప్రకారం ఇద్దరు హీరోలు కావాలి. డ్యూయల్ రోల్ చేస్తానన్నాడు రాంబాబు.

"తా దూర కంత లేదు మెడ కో డోలు" అన్నాడు ప్రొడక్షన్ మేనేజర్ పరమేశం.

"మీకు రాంబాబు పొటన్షియల్ తెలియదు. అందుకే అలా మాట్లాడుతున్నారు." అన్నాడు డైరక్టర్ గిరి.


"నీకు రాంబాబు అని ఎర్రిబాబు దొరకడం తో పుష్పా లెవల్ అని కబుర్లు చెప్పి చెవిలో పెద్ద పుష్పం పెట్టావు!" అని గొణుక్కున్నాడు పరమేశం.

బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాలన్ అందించాడు. సినిమా మధ్యలో ఉండగానే హీరోయిన్ కన్నడ హీరోతో ఎఫైర్ పెట్టుకుని తప్పుకుంది.

అలా సినిమాకి ఖర్చు పెరిగింది. తర్వాత రాంబాబు డ్యూయల్ రోల్ చేసేటప్పుడు కాలు విరిగి నాలుగునెలలు రెస్ట్ తీసుకున్నాడు.

డైరక్టర్ గిరి కథను... అమలాపురంలో మొదలు పెట్టి బాంకాంక్ దాకా తిప్పి మొత్తా నికి 50కోట్లతో కంప్లీట్ చేసాడు. కథ పెద్దగా లేదు, హలోబ్రదర్‌ని కొంచెం మార్చి, కాస్త రెండు అర్థాలు దట్టించి... రెండు ఐటమ్ సాంగ్‌లు కూరాడు.

"పైటేసా పాలకొల్లులో... రాటుదేలా...



రంగం లో...” ఐటమ్ సాంగ్ నెక్ట్స్ లెవల్‌కి తీసుకు వెడుతుందన్నాడు వమన్. ఈ లెవల్ ఏమిటో అర్థం కాలేదు పరమేశానికి.

✦✦✦


రాంబాబు తొలిసారిగా ద్విపాత్రాభినయంతో నటించిన ‘నీ యంకమ్మ’ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఖాళీగా ఉన్న వాళ్ళందరూ వచ్చారు. వంద రోజులు గ్యారంటీ అన్నారు. హీరోయిన్ కూడా వచ్చీ రాని తెలుగు లో ‘ షినిమా గొప్ప షిట్ అవుతుంది’ అంది.

“షిట్ కాదమ్మా! హిట్” అంది యాంకర్.

వందకోట్ల క్లబ్బులో ఈ సినిమా చేరిపోతుందని ఇంకొకాయన ఆశీర్వదించాడు.

టీవిలో గెంతే డాన్సర్లు ‘పైటేసే పాలకొల్లులో’ పాటకి స్టెప్పులేసారు.

✦✦✦



రాంబాబు సినిమా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో రిలీజయ్యింది.

రాంబాబు సినిమాకి హిట్‌టాక్ తెప్పించ డానికి ఓ పదిమంది కుర్రాళ్ళకి డబ్బులు ఇచ్చి హిట్, సూపర్ డూపర్ చెప్పించాడు. నిజంగా డబ్బులు కొని చూసిన వాళ్ళకి సురసురా కాలింది. కొన్ని చోట్ల తెరచించారు. కొన్ని చోట్ల కుర్చీలు పాడు చేసారు. కొన్ని చోట్ల డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రేక్షకులు ధర్నా చేసారు. ఇంత స్పందన వస్తుందని రాంబాబు ఊహించ లేదు.

ఇలా అన్నిచోట్ల విపరీతమైన స్పందన రావడంతో, ఒక్క ఆట చిత్రంగా మిగిలి రెండు రోజులకే ఓటీటీలోకి వచ్చింది.

రాంబాబు తండ్రికి 95 లో 90ఎకరాలు కరిగి 5 ఎకరాలు మిగిలాయి.

“బిజినెస్ బొక్క బోర్లా పడి, పంపిణీ దారులు ఏయిర్‌పోర్ట్‌లో కాపలా కాస్తున్నారు... ఈ సినిమాకి సంబంధించిన ఎవరు కనబడినా కొడదామని ఎదురు చూస్తున్నారు.” చెప్పాడు పరమేశం.

“అంత స్పందనా? ఇంతకీ ఏమంటారు?” అన్నాడు గిరి నెత్తి మీద చేతులుంచుకుని.

“దీనినే డిజాస్టర్ అంటారు!!” అన్నాడు పరమేశం

✦✦✦

ఆ సినిమా తర్వాత రాంబాబు అజ్ఞాతం లోకి వెళ్ళి పోయాడు.

రాంబాబు సినిమా భోజ్‌పురీలో డబ్బింగ య్యి ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు వచ్చాయి.

ఐదేళ్ళ తర్వాత రాంబాబు జిమ్ సెంటర్ పెట్టుకుని, రియల్‌ఎస్టేట్‌లో పార్ట్నర్‌గా రాణి స్తున్నాడు.

పరమేశం రాంబాబుని పలకరించడానికి వచ్చాడు.


“మన సినిమా ఎందుకు పోయిందో అర్థం కాలేదు. మసాలాలు బాగానే ఉన్నాయే...” అడిగాడు రాంబాబు.


“మసాలాలు కాదు బాబూ, విటమినులు ఉండాలి అంటే కథ ఉండాలి!” పరమేశం చెప్పాడు.

రాంబాబుకి జ్ఞానోదయమయ్యింది

# చిలిపి చిలుకలు

మురళీధర్








# అసలైన జీవితం

పద్మ పైడిమర్రి
7675045608

**"మేడం! మీ ఫోన్ ఇందాకటి నుంచీ మోగుతోంది. ఏదైనా ముఖ్యమైన కాల్ ఏమో... ఫోన్ ఇమ్మంటారా?" అని అడిగింది బ్యూటీపార్లర్‌లో ఫేషియల్ చేయించుకుని రిలాక్స్ అవుతున్న సుధని అక్కడే వున్న బ్యూటీషియన్.**

**"ఇంకా ఎంత సమయం పడుతుందీ మొత్తం అవ్వడానికి" అని అడిగింది సుధ ఆ అమ్మాయిని.**

**"ఇంకా హెయిర్ కలర్ వెయ్యాలి కదా? సుమారుగా గంట పడుతుంది మేడం!" అంది ఆ అమ్మాయి.**

"సరే ఫోన్ ఇటు ఇవ్వు ఒకసారి" అని, ఎవరు చేస్తున్నారో ఇన్నిసార్లు అనుకుంటూ ఫోన్ చూసింది సుధ.

ఎందుకబ్బా గీత ఇన్నిసార్లు చేసింది, అనుకుంటూ గీతకి ఫోన్ చేసింది సుధ.

"ఏమే... ఎక్కడున్నావు? ఎన్నిసార్లు చేసినా ఫోన్ తియ్యవే?" అంది అవతల నుంచి సుధ స్నేహితురాలు గీత.

"రేపు వుమెన్స్‌డే కదా? మా పిల్లలు మనందరికీ పార్టీ ఇస్తారుట. నీకు కూడా ఫోన్ చేస్తారులే... అందుకే పార్లర్‌కి వచ్చా! ఏమైనా అర్జెంటా?" అంది సుధ.

"ఈ వయస్సులో నీకు ఇవన్నీ అవసరమా?" అంది గీత.

"అవన్నీ నీకు అనవసరం!" అని ఫోన్ పెట్టేసింది సుధ విసుగ్గా.

కాసేపటికి అన్నీ పూర్తి చేసుకుని చక్కగా తయారై, ఇంటికి చేరింది సుధ.

పిల్లలకు పెళ్ళిళ్ళు అయిపోయాయి. మనవలు గూడా వచ్చేసారు. అయినా ఈ షోకులు ఏమిటో... అని చుట్టుపక్కల వాళ్ళు అప్పుడప్పుడు అనడం వింటూనే వుంది సుధ.

మరునాడు పార్టీలో గూడా కొంతమంది తన గురించి ఆ హెయిర్ కట్, లిప్‌స్టిక్, నైల్ పాలిష్ అన్నీ మ్యాచింగ్ ఎలా వేసుకుందో!... చిన్నపిల్లలా కనిపించాలని ప్రయత్నం చూడు! అని గుసగుసలాడుకోవడం వింది సుధ.

"అమ్మా! ఆంటీ చూడు ఎంత చక్కగా రెడీ అయ్యారో, మీరు గూడా కావాలంటే అలా తయారవ్వండీ, అంతేగాని ఎందుకూ ఇలాంటి మాటలు?" అంది పక్కింటి సంధ్య కూతురు వెన్నెల.



"ఇంకేమి తయారవుతాంలే, సగం వయస్సు అయిపోయింది. కానీ నిజం చెప్పాలంటే నాకు గూడా అలా సుధలా వుండాలనే వుంటుంది. అందరూ ఏమనుకుంటారో అని భయం!..." అంది సంధ్య, కూతురితో.

ఇంతలో పిల్లలూ మనవలూ కలసి... కేక్ కటింగ్ చేయించారు.

అందరూ భోజనాలు మొదలు పెట్టారు.

పిల్లలు "అమ్మా! ఏమైనా మాట్లాడు, నీకు నచ్చినవి చెప్పు అన్నారు!" సుధతో.

అప్పుడు మైక్ తీసుకుంది సుధ.

"ఇప్పుడు మనం కాసేపు సరదాగా మాట్లా దుకుందాం...ముఖ్యంగా ఇక్కడ వున్న ఆడ వాళ్ళు మీలో ఎవరికి మీరంటే మీకే ఇష్టం? మిమ్మల్ని మీరు ఎప్పుడైనా... ప్రేమించు కున్నారా? మిమ్మల్ని మీరు ఎప్పుడైనా అద్దంలో చూసుకుని మెచ్చుకున్నారా?" అని అడిగింది సుధ.

"ఇదేమి విడ్డూరం! మనల్ని మనం ఎలా ఇష్టపడతాం? మనల్ని మనమే ఎలా మెచ్చుకో గలం?" అంది గాయత్రి.

"అదే మరి! నీకు నువ్వే నచ్చకపోతే ఎవరి కైనా ఎలా నచ్చుతావు?... నిన్ను నువ్వు ప్రేమించు కోగలిగితేనే కదా... ఎవరినైనా ప్రేమించ గలుగుతావు!" అంది సుధ.


"అందుకేనా ఆంటీ... మీరు అంత బాగా తయారవుతారు?" అంది వెన్నెల సుధ కేసి ఆరాధనగా చూస్తూ.

"అయినా ఇప్పుడు ఏం మిగిలిందనీ? సగం జీవితం అయిపోయిందిగా?" అంది సంధ్య.

"అస్తమానం సగం జీవితం అయిపోయింది అనుకునే బదులు... ఇంకా సగం వుంది అను కోవచ్చుగా. అసలైన జీవితం ఇప్పుడే మొదల వుతుంది!" అంది సుధ.

"అదెలా?" అని ఆశ్చర్య పోయింది ప్రమీల.

మనం పుట్టాకా మొదటి పది సంవత్సరాలు దేని మీదా పెద్ద అవగాహన లేకుండానే గడిపేస్తాం... తరువాత పదినుంచీ ముప్పయి దాకా అంటే ఇరవై సంవత్సరాలు చదువూ, ఉద్యోగం ప్రేమా, పెళ్ళీ, ఇలా గందరగోళంగా గడిచిపోతుంది. ముప్పయి వచ్చేటప్పటికి పెళ్లి చేసుకుని పిల్లలు, వాళ్ల చదువులు, పెళ్లిళ్లు,




వాళ్ళకి పిల్లలు, ఇలా ఏమవుతోందో తెలియ కుండా పరుగు పెట్టేస్తాం.

పిల్లలు పెద్ద వాళ్ళు అయిపోతారు. వాళ్ళకి మన అవసరం తగ్గిపోతుంది. మనకి గూడా స్పీడ్ తగ్గి మనల్ని మనం చూసుకునేటప్పటికి అరవైలో వుంటాం.

ఒక్కసారిగా అద్దంలో చూసుకో బుద్ధి కాదు. నెరిసిన జుట్టు, కళ్లకింద ముడతలు, అమ్మో ఎలా వుండేదాన్ని ఎలాఅయిపోయా?... అని అనిపించక మానదు."

"మరి అరవై వస్తే పెద్ద వాళ్ళ కిందే లెక్క కదా?" అంది లక్ష్మి.

"అరవై వస్తే వాళ్ళు ఏమీ చెయ్యలేరనీ... డభైయ్ వస్తే ఎందుకూ పనికిరారని... ఎనభై వస్తే ఇంక అయిపోయినట్టే... అని ఎవరో ఎప్పుడో రాస్తే అదే నిజం అనుకుంటే ఎలా?" అంది సుధ.

"మరి ఏమి చెయ్యాలి?!... నీలా పార్లర్‌లకి వెళ్లాలా?" అంది గీత.

"అవసరంలేదు, కొంచమైనా తయారవ్వక పోతే అబ్బా! పెద్దవాళ్ళం అయిపోయాం ఏం చేస్తాములే, అని నిరాశగా అనిపిస్తుంది. అదే నెమ్మదిగా కుంగుబాటుకి దారితీస్తుంది... మనల్ని మనం ఉత్సాహపరుచుకోవడానికి అప్పుడప్పుడు ఇలా చేస్తే తప్పేమీలేదు..."

"సరే ఇంకోటి అడుగుతా చెప్పండి!... అరవై వచ్చాకా గూడా ఎవరైనా మిమ్మల్ని మీ పిల్లలకు మీరు అక్కలా వున్నారు అంటే మీకు నచ్చుతుంది కదా?" అని అడిగింది సుధ.

"నిజం ఆంటీ!ఎవరైనా అలా అంటే... మా అమ్మ ఆరోజంతా తెగ ఆనంద పడిపోతుంది." అంది వెన్నెల.


"ఎందుకు మరి మనం ఇలాంటి చిన్న చిన్న ఆనందాలను వదులుకోవడం? అంది సుధ.

"అరవై వచ్చాకనే అసలైన జీవితం మొద లవుతుంది. ఇన్ని రోజులూ అందరి కోసం బతికేసినా, మిగిలిన జీవితం మన సంతృప్తి కోసం బతకాలి.వయసనేది మనసుకు రానంత వరకూ మనం 'సిక్స్టీ' అయినా 'సిక్స్‌టీన్' కిందే లెక్క. మన జీవితం ఇప్పుడే మన చేతిలోకి వొచ్చింది... దాన్ని ఎంత అందంగా మొదలు పెడతామన్నది మనపై ఆధారపడి ఉంది. మన ఇష్టాలకు పట్టేసిన బూజుని దులుపుకుందాం... ఏమంటారు?" అని ఒక్కసారి మాట్లాడడం ఆపింది సుధ.

ఒక్క నిమిషం తరువాత అప్పటి దాకా సుధని విమర్శించిన వాళ్ళు గూడా చప్పట్లతో మారు మోగించేసారు.

అసలైన జీవితాన్ని అందంగా జీవించడానికి మరి ఆలస్యం ఎందుకూ?....

మొదలు పెట్టేద్దాం!!





# మేనేజర్ మిసెస్

ఆర్.సి.కృష్ణ స్వామి రాజు
9393662821

**గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ చతుర్వేద భార్యాబిడ్డలతోటి ఎల్టీసి మీద భద్రాచలం వెళ్ళాడు.**

**భద్రాద్రి రాముడిని తనివితీరా దర్శనం చేసుకున్నాడు. 'రామనామము రామ నామము, రమ్యమైనది రామనామము!' అని పాడుకుంటూ... ఫ్యామిలీతోటి తను పనిచేసే మండల కేంద్రానికి రైలెక్కాడు.**

ఊరు చేరిందే అతడికి తెలిసిన విషయమేమిటంటే... బ్యాంకుకు కొత్త మేనేజర్ వచ్చి ఛార్జ్ తీసుకున్నాడని.

మేనేజర్ వచ్చి డ్యూటీలో చేరి అప్పటికే నాలుగు రోజులయ్యింది. నేరుగా మేనేజర్ ఇంటికి వెళ్ళి పలకరిద్దామని లూజు ప్యాంటును బెల్టు వేసి గట్టిగా బిగించి స్వీటు, హాటు తీసుకుని వెళ్ళాడు.

తనని తాను పరిచయం చేసుకుని మరో మూడు రోజుల్లో వచ్చి డ్యూటీలో చేరుతానని చెప్పాడు.

బ్యాంకు సిబ్బంది, స్థానిక ఆర్థికవనరులు, కస్టమర్ల వైఖరి, డిపాజిట్ల సేకరణల గురించి మంచి చెడ్డలు మాట్లాడుకున్నారు.


లేచి వస్తున్న చతుర్వేద పలకరింపుగా...

“మేడమ్ గారు ఇంకా ఈ కొత్త ఇంటికి రాలేదా సార్?” అని అడిగాడు.

“ఎందుకు రాలేదు?... అందరం కలిసే వచ్చాం. అయితే ఇప్పుడామె హాస్పిటల్‌లో ఉంది!” అన్నాడు.

చతుర్వేద ముఖం వాడిపోయింది.

'అయ్యో! వచ్చిన వారంలోనే ఏమి ఉపద్రవం వచ్చిందో?... ఏ సమస్యతో హాస్పిటల్‌కి వెళ్లిందో!...' అని మనసులోనే బాధపడ్డాడు.



సమస్య ఏమిటని మేనేజర్‌ని అడుగుదామని పించింది కానీ... 'ఆడోళ్ళ ఆరోగ్య సమస్యలు అరవై ఉంటాయి. మగోళ్ళను అడిగితే ఏమి బాగుంటుంది?' అని అనుకున్నాడు.

రెండడుగులు లేస్తూ...

"ఊరుకాని ఊరు, ఏదైనా అవసరం ఉంటే నాకు ఫోన్ చేయండి సార్! క్షణాల్లో వచ్చి మీ ముందర వాలుతాను!" అని చెప్పి అక్కడినుంచి చిన్నగా కదిలాడు.

బజారులో చిన్నచిన్న పనులుంటే చూసుకుని ఇంటికి వెళ్ళాడు.

ఆ రాత్రంతా 'హాస్పిటల్‌లో చేరిన మేనేజర్ మిసెస్‌కి ఏమి జబ్బో పాపం!' అని ఆలోచిస్తూ నిద్రపోయాడు.

తెల్లారింది.


పిల్లలకి ఫీజులు కట్టడం, యూనిఫారం కుట్టించడం లాంటి పనులన్నీ చూసేసరికి ఆ రోజంతా గడిచిపోయింది.

శనివారం రాత్రని భార్య భరణి వేడివేడి చపాతీలు, ఉర్లగడ్డ కుర్మా చేసి పెడితే తింటూ కొత్త మేనేజర్ విషయం చెప్పాడు.

"వచ్చి వారం కాలేదు... వాళ్ళ భార్య హాస్పిటల్‌లో ఉంది!" అన్నాడు.

"అయ్యో పాపం... ఏమయ్యిందో ఏమో! నేను కూడా వస్తానండి... రేపటి ఉదయం ఇద్దరం వెళ్ళి పరామర్శించి వద్దాం!" అంది.

ఇద్దరూ నిద్రలేచి టిఫిన్ గట్రా ముగించుకుని కేజీ కాశ్మీర్ ఆపిల్ పండ్లు కొనుక్కుని...




మేనేజర్ ఇంటికి వెళ్ళారు.

మేనేజర్ తో అవీఇవీ మాట్లాడాక–

"మేడమ్ ఇంకా హాస్పిటల్ నుంచి రాలేదా సార్?" అని అడిగాడు చతుర్వేద.

"ఇంకా రాలేదండీ. హాస్పిటల్‌కి వెళ్ళింది కదా! వచ్చేస్తుంది!" అని బదులిస్తూ చతుర్వేద దంపతులకు నీళ్ళిద్దామని వంటగదిలోకి వెళ్ళాడు.

నిప్పుల్లో ఉప్పు వేసినట్లు చిటపట ముఖంతో భరణి... "మీ కొత్త మేనేజర్ కఠినాత్ముడిగా ఉన్నాడండి. లేకుంటే ఒళ్ళు బాలేని భార్యను ఒంటరిగా హాస్పిటల్‌లో చేరుస్తాడా? కనీసం డిశ్చార్జ్ అయ్యేటప్పుడైనా దగ్గర ఉండవద్దా?" అని చతుర్వేద చెవి కొరికింది


'నిజమే!... చాలామంది పెద్ద పదవుల్లో ఉంటారు కానీ బుద్ధులేమో అల్పబుద్ధులు' అని లోలోపలే మేనేజర్‌ని తిట్టాడు చతుర్వేద.


ఇంతలో ఇంటి ముందర ఆటో వచ్చి నిలబడింది.

అందులోనుంచి మేనేజర్ మిసెస్ దిగింది.

వైట్ అండ్ వైట్ డ్రెస్ వేసి... తలకి నర్స్ క్యాప్ పెట్టుకుని... భుజానికి బ్యాగు తగిలించుకుని నవ్వుతూ దిగింది.

'అంటే... మేనేజర్ మిసెస్ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్స్ అన్నమాట... పేషెంటు కాదన్నమాట' అన్న విషయం తెలుసుకున్న ఫీల్డ్ ఆఫీసర్ దంపతులిద్దరికీ తాగుతున్న నీళ్ళకి పొరపోయింది.






# విశ్వామిత్ర (ప్ర)యోగం

కంచనపల్లి ద్వారకనాథ్
9985295605

**ఏడక కుర్చీలో పడుకుని పీచు గడ్డం నిమురుకుంటూ దీర్ఘంగాఆలోచిస్తున్నాడు సైంటిస్ట్ విశ్వామిత్ర. ఇంత వరకు చిన్న చిన్న ప్రయోగాలు దేశం కోసం చేసి చిరు అవార్డులను పొందినప్పటి నుండి ఇంకా ఎన్నో ప్రయోగాలు చేసి ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చాలని... సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్ర మహర్షిలా ఆలోచిస్తున్నాడు విశ్వామిత్ర.**

తన ఆలోచనలని భంగపరుస్తూ పక్కనే వున్న టేబుల్ పై భార్య శంకరి వేడి వేడిగా పొగలు చిమ్మే కాఫీ టపీమని పెట్టడంతో...

విశ్వామిత్ర బెదరి ఆలోచనలు చెదరి... ఆవిరై తన మనసులో 'దీనికి వీళ్ళ అమ్మా నాన్నలు శంకరి అని కాదు భయంకరి అని పేరు పెట్టి ఉంటే బాగుండేది... ఎప్పుడూ రుస రుసలు లాడుతూ... కోపం ప్రదర్శిస్తూ వుంటుంది. అందుకు కారణం నేను ల్యాబ్‌లో కూర్చుని కప్పలతో, ఎలుకలతో, పాములతో ప్రయో గాలు చేస్తుంటానని... పైసా సంపాదన చేయలేని ఈ ప్రయోగాలు చేసి ఎవరిని ఉద్ద రించాలని, తన కొడుకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఉండబట్టి... వాడు డబ్బులు పంపడం వాళ్ళ ఇల్లు గడుస్తోందని ఎప్పుడూ నా మీద కారాలు, మిరియాలు, పోపు దినుసులు అన్ని కలిపి తన కోపంలో రంగరించి



చూపిస్తుందన్నమాట. అది తన సతి వాలకం, తన గతి అయోమయం...' అనుకుంటూ ఆలోచనలో పడిన విశ్వా మిత్రకు మెదడులో తళుక్కున ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

'ఈ కాలంలో పసిపిల్లల మొదలు ముసలి వాళ్ళ వరకు సెల్‌ఫోన్లల్లో చూసుకుంటూ పరిసరాలు మరచి పోయి... వాటిలో లీనమైపోయి బంధాలు... అనుబంధాలు... బాంధవ్యాలు... అన్ని వదలి పిచ్చోళ్ళులా ఫోను చూస్తూ నవ్వుకుంటూ, మతిమరపు రోగాలు, కళ్ళ జబ్బులు తెచ్చుకుంటున్నారు. దీనికోసం ఒక ఔషధం కనిపెట్టాలి... అది తాగితే ఎంతో కఠినాత్ముడైనా దవడలు బిగియపెట్టుకుని నవ్వనివాడైనా నవ్వురాని విలన్‌లాంటి వారైనా... చివరికి తన భార్య అయినా నవ్వాల్సిందే!... అయినా నవ్వు నానా రకాలు అని తెలియదేమో వీళ్ళకి... అమాయకపు నవ్వు, కోపాన్ని దాచుకునే నవ్వు, ఇబ్బందిగా నవ్వే నవ్వు, మాయలుచేసే నవ్వు, లోలోపలి నవ్వు, వ్యంగ్య నవ్వు, స్నేహపూరిత నవ్వు, ఉల్లాసపు నవ్వు, తొందరపాటు నవ్వు, అర్థంలేని నవ్వు, విసుగు పుట్టించే నవ్వు, గలగల నవ్వే నవ్వు, చిరునవ్వు.... అబ్బో ఇలాంటి ఎన్నో నవ్వులు వున్నాయని... వీళ్ళందరికీ కళ్ళు తెరిపించే ఔషధం కాదు... నోరు ఇకిలించే ఔషధం కనుక్కోవాలసిందే...అనుకుంటూ చల్లారి పోయిన గోరువెచ్చని కాఫీ తాగి సర్రున ల్యాబ్ లోకి పరుగెత్తాడు.

ప్రయోగం కోసం కొన్ని పుస్తకాలు ముందేసుకుని తిరగేసి, మాగేసి కాగితాలపై పెన్ను ముక్క అరిగిపోయేట్లు ఏవో కెమికల్స్ రాసుకుని చివరికి ఒక నిర్ణయానికి వచ్చి... నుదుటిమీద చెమటను చూపుడు వేలితో తీసి విసిరికొట్టి–

'వావ్! దొరికింది అసలైంది లాఫింగ్ గ్యాస్. దీన్ని వాసన చూస్తే నవ్వుతారు... కాబట్టి దీన్ని ఉపయోగించి ఒక కొత్త ఔషధం తయారు చేస్తాను... అని పూనుకుని రకరకాల ప్రయోగాలు చేసి చివరికి ఒక దివ్యమైన ఔషధం తయారు చేసాడు.

ఆ దివ్యమైన ఔషధం ఎంతవరకు పని చేస్తుందో చూడాలి అనుకుంటూ ల్యాబ్‌లోని ఒక ఎలుకకు పిల్లర్‌తో డ్రాప్ నోట్లో వేసాడు.

కొన్ని క్షణాల తర్వాత ఎలుక ఎగిరెగిరి పడుతూ... పల్టీలుకొడుతూ తన భాషలో కిచ్... హ్హా... హ్హా... కిచ్...కిచ్...హ్హా హ్హా అని నవ్వడం చూసి, విశ్వామిత్ర ఆనంద భరితుడై సినిమాల్లో ఏదైనా కనుగొన్న సైంటిస్ట్ సక్సెస్ అని గట్టిగా అరిచినట్లు అరవక గట్టిగా పగలపడి నవ్వాడు.

వెంటనే మరో డ్రాప్ పక్కనే వున్నా కప్ప నోట్లోకి వదలగా అది కొంతసేపటికి గంతులేస్తూ– బెక్...హ్హా... హ్హా...బెక్...హ్హా...హ్హా... అంటూ పల్టీలు కొట్టసాగింది.


విశ్వామిత్ర ఆనందానికి అవధులు లేవు. అసలు ఈ ఔషధం ఎంత కాలం పని చేస్తుందో తెలుసుకోవాలి అని అక్కడే వేచి చూసాడు.


ఒక గంట తర్వాత అవి మామూలు స్థితికి వచ్చాయి.

'హమ్మయ్య!... ఈ దివ్య ఔషధం మనిషిని రోజూ ఒక గంట నవ్విస్తే చాలు ఆరోగ్యంగా ఉంటాడు. నవ్వడానికి ఉపయోగపడే జైగోమిటికస్ కండరాలు బాగాపని చేస్తాయి... ఈ తరానికి ఇది దివ్యమైన ఔషధం అని, దీన్ని మనిషిపై ప్రయోగించాలి అని అనుకుంటూ... ఆలోచిస్తూ వీధిలోకి వచ్చాడు.

దారిన పోయే ఒక కుక్క కనపడగా దానిపై ప్రయోగిస్తే ఎలా వుంటుందన్న ఆలోచన వచ్చి ఒక బ్రెడ్‌ముక్క తెచ్చి, దాన్ని చూపుతూ లాబ్ లోకి తీసుకెళ్ళి...దాని నోట్లో ఒక బొట్టు ఔషధం వేసి... ఇజ్జు..ఇజ్జు... అంటూ "తినమ్మ" అని నోటి కందించాడు.

అది కొద్దిసేపటికి గంతులేస్తూ... రెండు



కాళ్ళపై లేచి తల అటు ఇటు తిప్పుతూ... భౌ...భౌ... హ్వా... హ్వా... భౌ... భౌ...హ్వా... హ్వా... అంటూ పడి పడి దొర్లింది.

విశ్వామిత్ర, కుక్కకు కాపలా కాసి దాని నవ్వు తగ్గి, మామూలు స్థితికి వచ్చేవరకు వేచి ఉండాలి... అనుకుంటుండగా...

"భోజనానికి తగలడండి! వచ్చి మెక్కండి!!" అని కోపంగా పిలిచిన శంకరిని చూచి...

'లాభం లేదు దీనికీ ఒక డోస్ మందు ఇవ్వాల్సిందే' అని అనుకుని... ఆమె తాగే నీళ్ళ గ్లాస్‌లో ఒక చుక్క కలిపాడు.

శంకరి ఆ నీళ్ళు తాగేసింది. ఇక వేరే చెప్పాలా?... ఆమె నవ్వులు, గంతులు, విన్యాసాలు, కేరింతలు, వింత విచిత్రపుచేష్టలు... విశ్వామిత్రకు కొంత ఆనందం కొంత భయం గూడా వేసి అన్ని తలుపులు మూసి వచ్చాడు.

అదే సమయానికి వీధి తలుపు చప్పుడైంది. మెల్లగా వెళ్ళి కొద్దిగా తలుపు తీసి తల బయట పెట్టి చూశాడు. ఒక అరడజను ఆడవాళ్ళు దేవుళ్ళు, రాక్షసులు వేసుకునే నగలు లాంటివి వేసుకుని, చెవులు తెగి పడతాయేమో అన్నట్లున్న మెడ వరకు వేలాడే హేంగింగ్సు, చేతుల్లో తట్టల్లో పళ్ళు, పసుపు కుంకాలు పెట్టుకుని పేరంటాలు నిలబడి వున్నారు.

విశ్వామిత్రకు ఏమి అర్థంకాలేదు.

అంతలో ఒకామె– "అన్నయ్యగారు!... తలుపు తీయండి... మీ ఆవిడని మేము చేసే వ్రతానికి పిలవాలి..." అంది.

విశ్వమిత్ర ఆముదం తాగిన వాడిలా ముఖం పెట్టాడు.

లోపల వింత నవ్వులు విన్న ఒక ఆవిడ–

"అన్నయ్యగారు! శంకరి ఊరెళ్ళిందా?... ఇంట్లో ఆమె లేదని... తలుపులేసుకుని మందు కొడుతూ... ఆ నవ్వులు వింటుంటే ఇంకేమైనా వగైరా... వగైరా చేస్తున్నారేమో అన్న అనుమానం వస్తోంది." అనగానే...

విశ్వామిత్ర వాళ్ళ మాటలకు నవ్వాలో... ఏడవాలో... బాధపడాలో అర్థం కాక తలుపు తీసి లోపలికి రమ్మని ఆహ్వానించాడు.

వాళ్ళు శంకరి చేస్తున్న విన్యాస, విచిత్ర నవ్వుల కేళీ విలాసాలు చూసి భయపడి... దీనికి పిచ్చి పట్టిందేమో ఇక్కడే వుంటే మనల్ని ఏం చేస్తుందో అని తెచ్చిన పేరంటాల సామాగ్రిని అక్కడే పడేసి పారిపోయారు.

శంకరికి మాములు స్థితి వచ్చే వరకు అక్కడే వున్నా కుర్చీల, మంచాల వెనుక దాక్కుని...

'అమ్మో!...నా మందు ఇంత పని చేస్తుందను కోలేదు... ఇంతకీ ఇది వికటించిందా?... లేక వికటట్టహాసం చేయిస్తోందా?' అనుకున్నాడు వంటికిపట్టిన చెమటతో విశ్వామిత్ర.

గొంతు తడరిపోయి పరిగెత్తుకుంటూ వెళ్లి... హడావిడిగా ల్యాబ్‌లో గ్లాసులోని ఒక చుక్క మిగిలిన ఔషధం నీళ్ళు అనుకుని తాగేసాడు.

ప్రయోగం కాదు కాని తన యోగం మారి పోయింది...

గంటసేపు వీరంగం వేసిన విశ్వామిత్ర... మామూలు స్థితికొచ్చి...


కలం కాగితం తీసుకున్నాడు.


'ఆనందం, సంతోషం మందులతో కాదు... మనసుతో పొందాలి...దాన్ని మనమే ఏర్పరచుకుని, దానికి సంబంధించిన మార్గం మనమే వేసుకోవాలి!' అని రాసి... భార్యని చూడడానికి గదిలోకెళ్ళాడు విశ్వామిత్ర.

## ఈ నెల 'దినం'

ప్రపంచ పర్యావరణ దినోత్సవం- జూన్,05









# నెల నెలా నవ్వుల వెన్నెల





ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- గరం గరం














ఇవాల్టి గరం గరం
వార్తలేంటి ఈరబాబు?
ఇందాకే గోదాలికి మీ అబ్బాయి గారు
పెసాదుగారమ్మాయితో లేచిపోయారండి!
ఆయ్!
Mani


ఇప్పుడే మీ అల్లుడు వచ్చాడు ...వేడి వేడి
వడ్డించి నీకు ఫోన్ చేస్తా
T.R. బాబు



అలా 'గరం గరం 'అయితే ఎలా?..
నీకు నచ్చిన చీరే కొంటాన్లేవే.. బాబూ!
TRIAL ROOM


నువు ఇంట్లోకొస్తున్నపుడు మా అమ్మతో నువు రాగానే
నీ మీద గరం గరం అవుతానన్లేదే.... ఏదో రంగ రంగా
అని దేవుణ్ణి తల్చుకున్నానంతే.......


ఈమె గరం గరం
అంటోందా లేక
రంగ రంగ అంటోందా!
"రంగంరంగరంగా"
Ramshankar A


గరమ్ గరమ్‌గా మిర్చిబజ్జీల
'వేయిస్తున్నా'నే!


లోపల అధిష్ఠానం గరం-గరం-గా
ఉంది. పార్టీ టిక్కెట్టు
గురించి వెళ్లొద్దు...
అంటే విన్నావా!
పార్టీ ఆఫీసు
Omkar


మా వారు ప్రతి చిన్న విషయానికీ
గరం అవుతున్నారు! కూల్‌గా వుండటానికి
ఆయనకి ఏమైనా మందు లివ్వండి డాక్టర్!
శరత్ బాబు




**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె.

ఇందునాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలను కుంటుంటాడు. ఇందు, ఆంధ్ర కురాడ్రు చందుని ఇష్టపడుతుంది. ఒక షాపింగ్‌కాంప్లెక్స్‌లో ఇందు, చందు కలుస్తారు.... **ఇప్పుడు...**

**సుబ్బు, లేచి కిచెన్‌లోకి వెళ్ళి, తలను గోడకేసి బాదుకుంటూ...పోలీస్‌ను బండబూతులు తిట్టుకోసాగాడు!**

**మీసాల వీసాచారి ఫోన్ రింగయ్యింది.**

**కాల్ అటెండ్ చేస్తూ... "సిద్ధమా?" అని అడిగాడు.**

**"సిద్ధం! మా అబ్బాయి దగ్గరకు వెళ్ళండి. కావాల్సింది ఇస్తాడు!" అన్నాడు ఫోన్‌లో, మార్వాడీ కొట్టులో పనిచేసే మోతీలాల్!**

**వీసాచారి, కారేసుకొని తాను ఆర్డర్ చేసిన డూప్లికేట్ నగను తీసుకోవడానికి వెళ్ళాడు.**

**నగను తయారు చేసిన మోతీలాల్ కొడుకు కిశోరీలాల్, వీసాచారికి నగను ఇచ్చాడు. వీసాచారి, నగను తన జేబులో ఉన్న నగ తాలూకు ఫోటోను పక్క పక్కన పెట్టి, భూతద్దంతో చూసాడు.**

"వారెవ్వా! 56 వజ్రాలుండేలా గిల్టు నగ భలే చేసారు!" మెచ్చుకుంటూ, కిశోరీలాల్‌కు డబ్బిచ్చి, ఆ నగను తీసుకొని బయటకు నడిచాడు.

అయితే తన నగ డూప్లికేట్ నంబర్3 అన్న విషయం వీసాచారికి తెలియదు!

తన తండ్రి మోతీలాల్ పనిచేసే మార్వాడీ కొట్టులో, ఇలాంటివే మరో రెండునగలు, ఇదే సమయానికి తయారు చేస్తున్నారన్న విషయం తండ్రి ద్వారా ఆల్రెడీ తెలుసుకున్న కిశోరీలాల్ ఒరిజినల్ నగను ఎలాగైనా సరే తెలివిగా కొట్టేయాలని... నాలుగు కార్లలో కూర్చొని ఉన్న, అమెరికా రౌడీలను అప్రమత్తం చేసాడు!

"వీసాచారి ఈ నగను, ఎవరి నగతోనో

మార్చి, నగరం దాటి వెళ్ళిపోతాడు. అది బాగా గమనించి... వీసాచారి దగ్గరున్న ఒరిజినల్ నగను ఎత్తుకు రండి!" అని పురమాయించాడు కిశోరీలాల్.

"ఒకవేళ, మీరిచ్చిన నగను, ఈ హ్యూస్టన్ నగరంలో ఎవరి నగతోనూ మార్చకుండా... డైరెక్టుగా నగరం వదిలి వెళ్లిపోతే?" ఫోన్‌లో అడిగాడు ఓ రౌడీ.

"ఏ నగరానికి వెళ్ళినా... ఎంత దూరం వెళ్ళినా... వెంబడించండి. అతను ఎవరి నగ అయితే, తన దగ్గరున్న నగతో మారుస్తాడో... అదే ఒరిజినల్!" అన్నాడు కిశోరీ లాల్.

✦✦✦

న్యూయార్క్ నగరంలో, సుబ్బు తాలూకు మనిషి రాఘవరావును ఫాలో అయ్యాడు.

రాఘవరావు, హోటల్‌లో దిగడం... ఒక నగల కొట్టుకు వెళ్ళి రావడం... అక్కడి నుండి ఎయిర్ పోర్టుకు వెళ్ళి హ్యూస్టన్ విమానం ఎక్కడం... అన్నీ చూసి... సుబ్బుకు మెసేజ్ పెట్టాడు.

సుబ్బు ఆ మెసేజ్ చదివి, కాస్త ఊపిరి పీల్చుకొన్నాడు.

సుబ్బును విచారిస్తున్న... పోలీసు భారీ సైజున్న పిజ్జాను ఒక్కడే పీక్కుతిని, భారీ కూల్ డ్రింక్ గుట గుటా తాగి...

"ఇప్పుడు చెప్పు! ఆ అమ్మాయిని ఎవరు చంపి ఉంటారంటావ్?" అన్నాడు.

"అది నాకెలా తెలుస్తుంది సార్?... మీరు చెప్పే దాకా, ఆమె చనిపోయిందన్న విషయమే నాకు తెలియదు!" అన్నాడు సుబ్బు.



"ఆ అమ్మాయిని చివరిసారిగా ఎప్పుడు చూసావ్?"

సుబ్బు కాస్త ఆలోచించి... "ఆరు నెలల క్రితం, ఓ రెస్టారెంట్‌లో ఒక అబ్బాయితో చూసాను!" అబద్ధమాడాడు సుబ్బు.

"ఏ రెస్టారెంట్?... ఏ అబ్బాయి?..." అన్నాడు పోలీస్.


"ఈట్ స్ట్రీట్ అనే రెస్టారెంట్‌లో చూసాను. ఆ అబ్బాయెవరో నాకు తెలియదు!" అన్నాడు సుబ్బు.

"మా దగ్గర పాత నేరస్తుల లిస్ట్ ఉంది. కాస్త చూసి..అందులో ఆ అబ్బాయి ఉన్నాడేమో గుర్తు పట్టి చెప్పు!" అని పోలీస్ తన ల్యాప్‌టాప్ తీసి, లాగిన్ అయ్యి, నేరస్తుల డేటా బేస్‌కు కనెక్ట్ అవసాగాడు.

"సార్! నేను వాషింగ్టన్ వెళ్ళాలని చెప్పాను కదా! వచ్చాక, తీరిగ్గా చూసి చెప్తాను!..." అన్నాడు సుబ్బు పైకి లేస్తూ.

పోలీస్ సీరియస్‌గా సుబ్బు వంక చూస్తూ–

"ఏ ఫ్లైట్‌కు బుక్ చేసుకున్నారో చెప్పండి. ఆ తర్వాతి ఫ్లైట్‌కు నా డబ్బులతో మిమ్మల్ని వాషింగ్టన్ పంపే బాధ్యత నాది! మీ స్నేహితురాలి హత్య విషయంలో మీరు ఆ మాత్రం సహకరించలేరా?... మా పై ఆఫీసర్లతో మీకు ఫోన్ చేయించి మరీ చెప్పించమంటారా? మీరు సహకరించకపోతే, స్టేషన్‌కు తీసుకెళ్ళి విచారించాల్సి వస్తుంది. జస్ట్, ఆ అబ్బాయి ఫోటో ఉందో లేదో చెప్పేసి వెళ్ళిపోండి!... ఆ తర్వాత నేను మిమ్మల్ని ఆపను." అన్నాడు పోలీస్.




ఎంత సేపు వెతికినా ఆ డేటాబేస్‌లో ఆ అబ్బాయి ఫోటో ఉండదని సుబ్బుకు తెలుసు. ఎందుకంటే, అలాంటి వాడెవడూ లేడు! సుబ్బు, సోఫాలో కూలబడిపోయి...పోలీస్ చూపిస్తున్న ఫోటోలు చూడసాగాడు.

పోలీసు, కావాలనే నెమ్మదిగా ఫోటోలు చూపసాగాడు.

✦✦✦

ఇందు,చందు, రచన, రామం బైనాక్యులర్స్‌లో సుబ్బును ముప్పులు తిప్పలు పెడుతున్న పోలీసును, సుబ్బు వాలకాన్ని చూసి నవ్వుకుంటున్నారు.

ఈ లోపు లాయర్ రామం ఫోన్ రింగయ్యింది.

"హలో!" అన్నాడు రామం.

"రామ సాబ్!... మీరు చెప్పిన పని పూర్తయ్యింది సాబ్!" అన్నాడు మార్వాడీ, ఫోన్‌లో అవతలి నుండి.

"ఇప్పుడే వస్తున్నాను!" అని రామం, తన కారెక్కి, మార్వాడీ దగ్గరకు వెళ్ళాడు.

మార్వాడీ ఆ నగను రామంచేతిలో పెడుతూ అడిగాడు..."సాబ్! మీరేమీ అనుకోకపోతే ఈ నగను ఏం చేయబోతున్నారో చెప్తారా?..." అడిగాడు.

రామం నవ్వి– "ఓ మ్యాగజైన్‌లో ఈ పాత కాలం నగను చూసాను. నా భార్యకు ఆ నగ ఎలాగూ గిఫ్టుగా తెచ్చి ఇవ్వలేను. అందుకే, అలాంటి ఒక నగను చేయించి నా భార్యకు గిఫ్టుగా ఇద్దమనిపించి ఇలా తయారు చేయించాను... లాంటి అబద్దాలు మీకు చెప్పలేను మార్వాడీ గారు! ఒక మంచిపని కోసం ఈ నగ కావాలి! అది మాత్రం చెప్పగలను. ఏ మంచివాడినో మోసం చేసి, ఒరిజినల్ నగను కాజేయాలనే దుర్బుద్ధి కూడా నాకు లేదు. ఇది తయారు చేసి నాకు ఇవ్వడం వల్ల, భవిష్యత్తులో మీకెలాంటి సమస్యా రాదు! అది నా గ్యారంటీ! ఇంతకంటే ఏమీ చెప్పలేను!"అన్నాడు రామం చిరునవ్వుతో!


మార్వాడీ ప్రశాంతంగా...

"మంచిది సాబ్! రాం రాం!" అన్నాడు.

"రాం రాం!..." అనేసి రామం ఆ నగను తీసుకొని కారెక్కాడు.

ఇది డూప్లికేట్ నగ నంబర్ 1!

రామం, ఆ నగను తీసుకొని వచ్చి, ఇందుకు



ఇచ్చాడు. ఆమె ఆ నగను తన హ్యాండ్‌బ్యాగులో వేసుకొంది!

✦✦✦

విమానం హ్యూస్టన్ నగరంలో దిగింది.

ఇందు,చందు, రాఘవరావును ఎయిర్ పోర్టులో రిసీవ్ చేసుకొని, ఇందు ఇంటికి వెళ్ళారు.

వారు ఇంటికి వెళ్ళేసరికి, ఇంటి ముందు రాయికి కట్టిన కాగితపు ఉండ కనిపించింది.

అది తీసుకొని చూసారు.

"ఆ వస్తువును, బాప్స్ స్వామినారాయణ్ మందిర్‌కు దగ్గరలో, ఒక పిల్లకాలువ లాంటిది పారుతోంది. ఆ కాలువ వెంట ఉత్తరం వైపు నాలుగు కిలోమీటర్లు వస్తే, నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతంలో కాలువను ఆనుకొని అమె రికా జెండా పెయింట్ వేసి ఉన్న ఒక పెద్ద బండరాయి కనిపిస్తుంది... దాని కింద పెట్టి వెళ్లిపోండి. మేము దాన్ని కలెక్ట్ చేసుకుని వెళ్ళి పోయిన గంట తర్వాత, అష్టలక్ష్మి దేవాలయానికి ఎదురుగా ఉన్న వీధిలో సంజీవని మీకు కనిపిస్తుంది! మమ్మల్ని ఫాలో ఔతున్నట్లు తెలిస్తే మొదటికే మోసం వస్తుంది... జాగ్రత్త!"

వెంటనే రామానికి కాల్ చేసి... చందు విషయం చెప్పాడు.

రామం, సుబ్బు ఇంట్లో ఉన్న పోలీసుకు ఫోన్ చేసి...

"ఇక మీరు వెళ్ళిపోవచ్చు. థాంక్ యూ!" అన్నాడు.

"ఓహ్! చనిపోయింది ఆ అమ్మాయి కాదా? ఆ అమ్మాయిలా ఉండే ఇంకో అమ్మాయా? అరే... అనవసరంగా ఇక్కడ సుబ్బు అనే జెంటి ల్మెన్‌ను కంగారు పెట్టానే!... ష్యూర్! నేను వస్తున్నాను!" అని పోలీస్ ఫోన్ పెట్టేసి, సుబ్బు వంక తిరిగి... "ఐయాం సారీ! ఎక్కడో చిన్న పొరపాటు!" అన్నాడు.

సుబ్బు, బతుకు జీవుడా అనుకుంటూ...

"ఇక నేను వెళ్ళొచ్చా?" అన్నాడు.

"ష్యూర్!" అన్నాడు పోలీసు బయటకు నడుస్తూ.


వెంటనే సుబ్బు, తన ఇంకో ఫోన్‌తో, తాను కరీబియన్ దీవులకు ఏ అమ్మాయితో ఐతే కలిసి వెళ్ళాడో, ఆమెకు ఫోన్ చేసాడు.

ఆమె ఫోన్ ఎత్తి– "ఏయ్ సుబ్బు! ఈసారి ట్రిప్ ఎక్కడికి వెళదాం?" అంది.

సుబ్బు ఆమెకు పోలీసు విషయం చెప్ప బోయాడు.

వెంటనే ఆమె– "ఓ సుబ్బు! జస్ట్ పది నిమిషాల క్రితం పోలీసులు మా ఇంటికి వచ్చారు. ఎవరో అమ్మాయిని, ఎవడో చంపాడట. ఆ చచ్చింది నేనేమో అనుకొని ఎంక్వైరీ చేస్తూ నా దగ్గరకు వచ్చి... అదేంటి నువ్వింకా చావ లేదా? చచ్చిపోయింది నువ్వు కాదా? లాంటి ప్రశ్నలతో వేధించారు. నేను బతికే ఉన్నానురా సామీ... కావాలంటే మీకు తొడపాశాలు పెట్టి, గిల్లి ప్రూవ్ చేయమంటారా అని అడిగితే... దెబ్బకు నోరు మూసుకొని వెళ్ళిపోయారు!" అంది ఆ అమ్మాయి నవ్వుతూ!

"సరే ఉంటాను. తర్వాత మాట్లాడతాను! బై!" అని సుబ్బు ఫోన్



పెట్టేసి... 'హమ్మయ్య!' అని గాలి పీల్చుకొని, "ఈ అమెరికా పోలీసు పీనుగులు...బతికి ఉన్న వాళ్లకే పిండం పెట్టేలా ఉన్నారు... ఛీఛీ! ఆ పోలీసు నా తల తిన్నాడు!" అనుకుంటూ గబ గబా బట్టలు సర్దుకోసాగాడు.

సుబ్బు ఫోన్ మోగింది.

సుబ్బు ఫోన్ లిఫ్ట్ చేసి,"చెప్పు!"అన్నాడు.

✦✦✦

"రాఘవరావు, ఇందు చందు..ముగ్గురూ ఎయిర్ పోర్ట్ నుండి, ఇంటికి వెళ్ళారు! వీసాచారి గ్యాంగు వదిలివెళ్ళిన ఉత్తరం చదివారు. రాఘవరావు ఇంట్లో ఫ్రెష్ అవుతున్నట్లు ఉన్నాడు. కాసేపట్లో, వీళ్లు బయల్దేరతారు!" సుబ్బు మనిషి బబ్లూ చెప్పాడు.

**(సశేషం)**

# పదానందం-11



కూర్పు: **పోపూరి విశ్వనాథ్, 9133197111**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | 4 | |
| | | | | 5 | | | |
| 6 | | | | | | | |
| | | 7 | | | | 8 | 9 |
| 10 | 11 | | | 12 | 13 | | |
| | | | 14 | | 15 | 16 | |
| 17 | | 18 | | 19 | | | |
| | | | | 20 | | | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. విశ్వదాభిరామ ........ (5)
5. రాయలవారి మహామంత్రి (4)
6. గొడవ, పోట్లాట (3)
7. సిద్ధం (3)
8. మారకం, రూపాంతరం (2)
10. ఆటల్లో (తిరగబడి) మోసం చేయడం (2)
12. దీనిమీద పుట్ర అని సామెత (2)
15. ఓర్పు, బలం తిరగబడింది (3)
17. రంగులు మార్చేది అక్షరాలను కూడా మార్చుకుంది (5)
20. ఆదిభట్ల నారాయణదాసు దీనికి ప్రసిద్ధి (4)

**నిలువు**

1. స్వైరం, యధేచ్ఛం (5)
2. రాసినవాడు, గ్రంథకర్త (4)
3. గుర్తుండకపోవడం (5)
4. పత్తా, విలాసం (4)
9. ఊరడింపు తలక్రిందులైంది (3)
11. త్వర (3)
13. ఈ యుగం పైకొచ్చింది (2)
14. కుట్టి రక్తం పీల్చేది (2)
16. దీని మీద బ్రహ్మాస్త్రమా? (3)
17. సున్నం (2)
18. బుట్ట, అటక (2)
19) యోచన, అనుకోవడం (2)

సమాధానం వచ్చే సంచికలో...

## గత సంచిక సమాధానం

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 త | 2 లి | శె | 3 ట్టి | | 4 బా | పు | | 5 గో | పి |
| | బా | | శె | | చి | | 6 వ | పా | |
| 7 దా | | | గి | | | | | ల | |
| స్ | | 8 ఓ | నా | 9 వ | | 10 రా | మ | కృ | ష్ణ |
| | 11 బ్నిం | | | డ్డే | | గ | | ష్ణ | |
| 12 త్య | | | 13 ద్మ | ప | | తి | | | 14 ద |
| 15 స | 16 ర | సి | | ల్లి | | | 17 రా | | యా |
| | మా | | | | 18 సు | ధా | మ | | క |
| | | | 19 క్రి | | నీ | | 20 శే | ఖ | ర్ |
| 21 జ | య | దే | వ్ | | ల్ | | షు | | |


ఇంటిల్లిపాదినీ నవ్వించే పని పెట్టుకున్న
ఏకైక తెలుగు హాస్య మాస పత్రిక



మనోవికాసానికి మందు
ఆనందం!...
హాస్యానందంతోనే
ఇది సాధ్యం!

చందాదారులుగా చేరండి.


Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

PRIYANKA PANDA
DESIGNER STUDIO



One stop shop for your designer wear

- Women
- Men
- Kids

Designing & Stitching

Call: +919959222411.
email: labelpriyankapanda@gmail.com

Hasyanandam June -2024. RNI No. APTEL 08387/01/1/2003-TC

